@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
హైదరాబాద్
మంగళవారం 28 జూలై 2026
సంపుటి : 02
సంచిక :26
పేజీలు : 12 వెల : 5/-
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

## బహు శిరస్సుల జల రాక్షసిలా
# హైడ్రా తీరు



- హైడ్రా కమిషనర్‌గా కొనసాగే హక్కు లేదన్న హైకోర్టు
- ఆ పదవి నుంచి తప్పించాలని సీఎస్‌కు ఆదేశం
- ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాలన్న న్యాయమూర్తి
- రంగనాథ్ క్షమాపణ అఫిడవిట్ తిరస్కరణ
- అది పశ్చాత్తాపం కాదు.. శిక్ష నుంచి తప్పించుకోవడానికి చేసే ప్రయత్నం మాత్రమే
- పదేపదే మా ఆదేశాలు ఉల్లంఘించి న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించారు
- హైడ్రా కమిషనర్‌గా ఆయనపై 63 ధిక్కరణ కేసులు...
- హైడ్రా ఉద్దేశం మంచిదే అయినా చట్టాన్ని పాటించాల్సిందే..
- గ్రీకు పురాణాల్లోని 'హైడ్రా' అనే బహు శిరస్సుల జల రాక్షసిలానే ఈ హైడ్రా తీరు
- ప్రభుత్వ సంస్థలు చట్టాన్ని అతిక్రమించే స్థాయికి చేరితే అది దేశానికే ప్రమాదకరమన్న హైకోర్టు



## యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై మంగళవారమే చర్చ

- అధికార, విపక్షాల మధ్య కుదిరిన సయోధ్య!
- జూలై 28న యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ
- పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలపై ఉక్కుపాదం మోపేలా చట్టంలో కీలక సవరణలు
- విపక్షాలు నిరసన కొనసాగించడం వల్ల చర్చ సాధ్యపడలేదు

# తెలంగాణకు 13వ స్థానం



- పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల ర్యాంకింగ్స్‌లో తెలంగాణకు 13వ స్థానం
- పెద్ద రాష్ట్రాల కేటగిరీలో 10వ ర్యాంకు.. గుజరాత్‌కు అగ్రస్థానం
- ప్రభుత్వ విధానాలు, వ్యాపార అనుకూలత, ఆర్థిక ఆరోగ్యంలో రాష్ట్రానికి మంచి మార్కులు
- మౌలిక సదుపాయాల కల్పన,సంస్థాగత వాతావరణంలో మైనస్ మార్కులు
- నీతి ఆయోగ్ 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్--2026' నివేదిక వెల్లడి

**హైదరాబాద్**
పెట్టుబడులకు స్నేహపూర్వక వాతావరణం అంశంలో వివిధ కేటగిరీలు కలిపి తెలంగాణకు 100కు 47.3 మార్కులు వచ్చాయి. తద్వారా దేశవ్యాప్తంగా రాష్ట్రానికి 13వ ర్యాంకు లభించింది. అలాగే దేశంలోని పెద్ద రాష్ట్రాల కేటగిరీలో 10వ ర్యాంకు లభించింది. ఈ మేరకు నీతి ఆయోగ్.. 'పెట్టుబడులకు సంబం ధించిన స్నేహ పూర్వక వాతావరణం సూచిక-2 026'ను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం దేశంలోనే పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా గుజరాత్‌కు అగ్రస్థానం లభించింది. టాప్ 5 రాష్ట్రాల్లో గుజరాత్ (56.6 మార్కులు), మహారాష్ట్ర (53.7), - మిగతా3లో



## భారత కరెన్సీపై పదేళ్ల ఆంక్షలకు తెర

- రూ. 500 నోట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపాల్
- భారత కరెన్సీపై ఆంక్షలు సడలించిన నేపాల్
- రూ. 200, రూ. 500 నోట్ల వినియోగానికి అనుమతి

## 'సర్'కూ ఇది
# ఉపయుక్తం

**ఎలక్ట్రానిక్ పద్ధతిలో రాష్ట్రంలోని అన్ని కుటుంబాల వివరాలు నిక్షిప్తం**




- ప్రతి కుటుంబానికి చెందిన 8 అంశాలు నమోదు
- మీ సేవ కేంద్రాల ద్వారా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ
- ఈ సర్టిఫికెట్ ఎలాంటి హక్కులు కల్పించదు..లబ్ధి కలగదు
- ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ

**హైదరాబాద్**
రాష్ట్రంలోని కుటుంబాల వివరాలన్నింటినీ ఎలక్ట్రానిక్ పద్ధతిలో నమోదు చేయడం ద్వారా 'ఫ్యామిలీ రిజిస్టర్'రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పలు ప్రభుత్వ సేవలు పొందే విషయంలో కుటుంబ వివరాలకు సంబంధించిన నమ్మకమైన రికార్డును చూపించడంలో ఎదురవుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని, కుటుంబ వివరాల పరిశీలనలో ఏకరూపత, సులభంగా అందుబాటులో ఉండటం లక్ష్యంగా రికార్డును రూపొందించాలని సర్కారు - మిగతా3లో



## మరి రేవంత్ రాజీనామా చేయరా?

- సీఎం రేవంత్ విద్యాశాఖ మంత్రిగా ఉండగానే టెన్త్ క్లాస్ పేపర్ లీక్ అయ్యింది
- దేశ హితం కోసం ఏ వ్యవస్థ వచ్చినా తప్పులేదు
- దేశానికి నష్టం చేసే వ్యవస్థ మాత్రం ఉండకూడదు

## ఆకివీడు రామాలయానికి
# సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్



- ఆకివీడు రామాలయానికి సుప్రీంకోర్టు అనుమతి
- నిర్మాణ వ్యతిరేక పిటిషన్ కొట్టివేత
- కలెక్టర్ ఎన్‌వోసీ చట్టబద్ధమేనని స్పష్టీకరణ
- ప్రభుత్వ భూమిలో నిర్మాణానికి అభ్యంతరం లేదన్న కోర్టు



## అలా జరగకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతాం

- కేంద్రానికి కాక్రోచ్ జనతా పార్టీ వార్నింగ్!
- విద్యార్థులపై పోలీసుల చర్యలు ఒప్పందానికి విరుద్ధమని కేంద్రంపై సీజేపీ ఆరోపణ
- ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరించుకొని అరెస్ట్ అయిన వారిని విడుదల చేయాలని డిమాండ్
- అలా జరగకుంటే మళ్లీ దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని వార్నింగ్



## యుద్ధ విరామంతో దిగొచ్చిన చమురు ధరలు

- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తత తగ్గడంతో చమురు ధరల పతనం
- బ్రెంట్, డబ్ల్యూటీఐ ధరలు ఏడు శాతం వరకు తగ్గుదల
- దౌత్యపరమైన పరిష్కారంపై మార్కెట్‌లో ఆశలు
- ఇంకా పూర్తిగా తొలగని సరఫరా అంతరాయ భయాలు
- చమురు పతనంతో రూపాయికి భారీ ఊరట

**ఒక్కరోజే 7 శాతం పతనం**

# యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై మంగళవారమే చర్చ

పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధానికి రూపొందించిన చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై జరిగిన ఆందోళనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసినందుకు హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాలు నినాదాల మధ్య బిల్లును సభ ముందుకు తీసుకొచ్చింది. అయితే విపక్షాల నిరసనలతో ఎలాంటి చర్చ జరగనుండానే ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధికార, విపక్ష సభ్యులతో చర్చించి సయోధ్య కుదిర్చారు. దీనితో మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది.



పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసే వారిని కఠినంగా శిక్షించడమే లక్ష్యంగా కేంద్రం పరీక్షల్లో అక్రమాల నిరోధక చట్ట సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టింది. విపక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలపై ఉక్కుపాదం మోపేలా చట్టంలో కీలక సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. అయితే విపక్షాలు నిరసన కొనసాగించడం వల్ల చర్చ సాధ్యపడలేదు. ఈ క్రమంలో సభ మొదట 12 గంటలకు తర్వాత 2గంటలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత కూడా విపక్షాలు ఆందోళన కొనసాగించగా స్పీకర్ అధికార, విపక్ష సభ్యులకు 3 గంటలు సమయం ఇచ్చారు. విభేదాలు పరిష్కరించుకోవాలని కోరుతూ సభను సాయంత్రం ఐదు గంటలకు వాయిదా వేశారు. అయితే తిరిగి సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవడం వల్ల సభ మంగళవారానికి వాయిదా పడింది.

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జ్ పై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. వారి నిరసనల మధ్య సభ మూడు సార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బిల్లును సభలో ప్రవేశపెట్టి చర్చించేందుకు సభ్యులు సహకరించాలని రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ సింగ్ కోరినప్పటికీ విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో సభ సాయంత్రం 5గంటల 15 నిమిషాలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విపక్షాలను మరోసారి కోరారు.

"పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి అత్యంత కీలకమైన బిల్లును తీసుకొచ్చాం. ఈ బిల్లుపై చర్చ కోసం నిన్న కోరాను. ఇవాళ ఉదయం నుంచి అభ్యర్థిస్తూనే ఉన్నాను. కానీ మీరు (విపక్షాలు)వ్యతిరేకిస్తున్నారు. మళ్లీ కాంగ్రెస్ వాళు బయటకు వెళ్లి సభలో మమ్మల్ని మాట్లాడనియ్యడం లేదని చెబుతున్నారు. నేను చేతులు జోడించి కోరుతున్నా, మీరు సభలో మాట్లాడండి. కానీ మీరేమో మాట్లడడం లేదు. ఇదేం పద్ధతి?" అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అయితే విద్యార్థులపై లాఠీఛార్జ్ విషయంలో హోంమంత్రి ప్రకటన చేయాలని విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. "చర్చకు మేమేమీ భయపడడం లేదు. చర్చకు సిద్ధంగా ఉన్నాం. కానీ హోంమంత్రి సభకు వచ్చి ప్రకటన చేయాలి. లాఠీఛార్జ్ చేసి విద్యార్థులను చావగొట్టారు. దీనిపై సమాధానం చెప్పాలి" అని మల్లికార్జున ఖర్గే అని అన్నారు. దీని తర్వాత ఉపాధ్యక్షుడు హరివంశ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

అయితే లోక్‌సభలోని అన్నిపక్షాలతో సమావేశమైన స్పీకర్ ఓంబిర్లా అత్యంత కీలకమైన బిల్లుపై చర్చకు సహకరించాలని కోరారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంగళవారం చర్చ చేపట్టేందుకు అన్నిపక్షాలు అంగీకరించినట్లు పార్లమెంటు వర్గాలు తెలిపాయి.

**ఈ బిల్లులో ఏముంది?**

ఈ ప్రతిపాదిత బిల్లు ప్రకారం, పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించారు. జరిమానాను రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేశారు. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను రూ.1కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చారు. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదనలు చేశారు. ఒక వేళ నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారని తెలుస్తోంది.

# అలా జరగకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతాం



నీట్ ఆందోళనల సందర్భంగా కేంద్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (జఖీా) కేంద్ర ప్రభుత్వానికి మరోసారి వార్నింగ్ ఇచ్చింది. విద్యార్థులపై నమోదైన కేసుల్ని వెంటనే ఉపసంహరించు కోవాలని, అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో మళ్లీ దేశవ్యాప్తంగా నిరసనలకు దిగుతామని హెచ్చరించింది. సోమవారం రోజు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పార్టీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా– బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌లను ఉద్దేశించి పోస్ట్ చేశారు. నిరసనకారులపై ఎలాంటి పోలీసు చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని పాటించడం లేదని ఆరోపించారు.

బిహార్, బెంగాల్‌లో వందల మంది విద్యార్థుల్ని అరెస్ట్ చేశారని, దిల్లీ సహా ఇతర రాష్ట్రాల్లో ఆందోళనకు మద్దతు ఇచ్చిన వాలంటీర్లను పోలీసులు వేధిస్తున్నారని రాంకా ట్వీట్ చేశారు. నిరసనకారులపై రిజిస్టర్ అయిన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే రద్దు చేయాలని, ఇప్పటికే అదుపులోకి తీసుకున్న విద్యార్థుల్ని విడుదల చేయాలని అన్నారు. ఇంకా భవిష్యత్తులో కూడా కొత్త కేసులు నమోదు చేయబోమని లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన రాంకా– జులై 25న మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో జరిగిన మూడో విడత చర్చల్లో కీలక ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. జంతర్ మంతర్ నిరసనలు, జులై 20న జరిగిన ఆందోళనతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలకు సంబంధించి నిరసనకారులు, నిర్వాహకులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. భవిష్యత్తులో కూడా కొత్త కేసులు నమోదు చేయబోమని హామీ ఇచ్చిందన్నారు.

ఈ ఒప్పందానికి సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను తాము ఇప్పటికే జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌కు అందజేశామని, మంగళవారం నాటికి ప్రభుత్వం కూడా లిఖితపూర్వక ఒప్పందం ప్రతిని అందిస్తామని చెప్పిందని ఆశుతోష్ రాంకా అన్నారు. ఇరు పక్షాల న్యాయవాదులు పరిశీలించిన తర్వాత తుది ఒప్పందం ఖరారవుతుందని చెప్పారు. మంగళవారం లోపు ప్రభుత్వం లిఖితపూర్వక ఒప్పందాన్ని అందించకపోతే, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న విద్యార్థులు, యువతను విడుదల చేయకుంటే కాక్రోచ్ జనతా పార్టీ మళ్లీ దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా పార్లమెంటులో కూడా ఈ అంశం ప్రతిధ్వనించింది. బిహార్‌లో విద్యార్థులపై పోలీసుల చర్యలు, కాల్పుల ఆరోపణలపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దీనికి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**న్యాయసహాయం కోసం ఆన్‌లైన్ ఎయిడ్ ఫండ్!**

నీట్ పేపర్ లీక్ అంశంపై ఆందోళన ముగిసిన తర్వాత కూడా విద్యార్థులపై కేసులు నమోదు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన సీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులకు న్యాయ సహాయం అందించేందుకు ప్రజల విరాళాలతో ఆన్‌లైన్ లీగల్ ఎయిడ్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. గతంలో జరిగిన పలు ఉద్యమాల్లో నిరసనలు ముగిసిన తర్వాత పలువురిని లక్ష్యంగా చేసుకొని, తప్పుడు కేసులు పెట్టిన ఘటనలు జరిగాయని సీజేపీ ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్ అన్నారు. అదే పరిస్థితి మళ్లీ తలెత్తే అవకాశం ఉందనే అనుమానంతో ఉద్యమాన్ని విరమించే ముందు, తర్వాత కూడా సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సలహాలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారికి న్యాయ సహాయం అందించేందుకు తాను రూ. 1 కోటి విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు కపిల్ సిబల్. దేశవ్యాప్తంగా న్యాయవాదులు కూడా ముందుకొచ్చి విద్యార్థులకు న్యాయ సహాయం అందించాలని పిలుపునిచ్చారు.

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో తొలి విచారణ వాయిదా**

నీట్– యూజీ 2026 పేపర్ లీక్ కేసు విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో తొలి విచారణ సోమవారం వాయిదా పడింది. ఈ కేసులో సీబీఐ తరఫున న్యాయవాది ఎవరూ హాజరుకాకపోవడంతో న్యాయస్థానం విచారణను ఆగస్ట్ 3 కు వాయిదా వేస్తూ, తదుపరి విచారణకు తప్పనిసరిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని ఆదేశించింది. ఈ పరిణామంపై కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ– 'పేపర్ లీక్ కేసుల్ని వేగంగా విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామని కేంద్రం చెబుతుంటే, తొలి విచారణకే సీబీఐ న్యాయవాది హాజరుకాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.' అని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎలా చెప్పగలదని ప్రశ్నించారు.

**జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల సందడి!**

మరోవైపు జంతర్ మంతర్ దగ్గర 36 రోజుల పాటు సాగిన సీజేపీ విద్యార్థుల నిరసనల తర్వాత అక్కడ పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. నిరసన శిబిరాలు తొలగించినప్పటికీ, ఆందోళనలు జరిగిన ప్రదేశాన్ని చూసేందుకు దిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు, యువత అక్కడికి వస్తున్నారు. కొందరు సెల్ఫీలు తీసుకుంటుండగా, మరికొందరు సోషల్ మీడియాలో చూసిన ప్రదేశాన్ని ప్రత్యక్షంగా చూడాలని వచ్చినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో జంతర్ మంతర్ వద్ద కొత్త నిరసనలు కూడా ప్రారంభమయ్యాయి. గోర్ఖాలాండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం గోర్ఖాలాండ్ రాష్ట్రీయ మంచ్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. మరోవైపు మహిళలకు పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మరో మహిళా సంఘం కూడా నిరసనలు కొనసాగిస్తోంది.

## భారత కరెన్సీపై పదేళ్ల ఆంక్షలకు తెర



భారత కరెన్సీ వినియోగంపై నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఆంక్షలను సడలిస్తూ, రూ. 200, రూ. 500 విలువైన భారత కరెన్సీ నోట్లను దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతించింది. భారతీయులు, నేపాలీ పౌరులు ఇరు దేశాల మధ్య ప్రయాణించేటప్పుడు రూ. 25,000 పరిమితికి లోబడి ఈ నోట్లను తమ వెంట ఉంచుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో 2016లో భారత్ చేపట్టిన నోట్ల రద్దు అనంతరం విధించిన నిబంధనలకు తెరపడినట్లయింది. నేపాల్ రాష్ట్ర బ్యాంక్ (ఎన్ఆర్‌బీ) ఈ మేరకు ఒక అధికారిక ప్రకటనను తిరిగి జారీ చేసింది. 2016 నవంబర్ 9 తర్వాత ముద్రించిన కొత్త రూ. 200, రూ. 500 నోట్లకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. నోట్ల రద్దుకు ముందు చెలామణిలో ఉన్న పాత రూ. 500, రూ. 1,000 నోట్లపై నిషేధం యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది. వాస్తవానికి ఈ నిబంధనలు ఫిబ్రవరి 11నే నేపాల్ గెజిట్‌లో ప్రచురితమైనప్పటికీ, అమలులో స్పష్టత కోసం కేంద్ర బ్యాంక్ మరోసారి ఈ ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పులపై ఎన్ఆర్‌బీ ప్రతినిధి గురు ప్రసాద్ పౌడెల్ మాట్లాడుతూ.. నేపాల్ పౌరులు భారత్ నుంచి మాత్రమే ఈ కరెన్సీని దేశంలోకి తీసుకురావాలని, అలాగే నేపాల్ నుంచి భారత్‌కు తప్ప మరే ఇతర దేశానికీ తీసుకెళ్లరాదని స్పష్టం చేశారు. ఈ తాజా నిర్ణయంతో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపారం, పర్యాటకం మరింత సులభతరం కానుంది. ముఖ్యంగా నేపాలీ వ్యాపారులు, భారత పర్యాటకులకు ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. భారత్, నేపాల్ మధ్య స్వేచ్ఛాయుత సరిహద్దు ఉండటంతో పాటు ప్రజల మధ్య, వాణిజ్యపరంగా బలమైన సంబంధాలు ఉన్నాయి. భారత్, నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. నోట్ల రద్దు తర్వాత కేవలం రూ. 100, అంతకంటే తక్కువ విలువైన నోట్లను మాత్రమే అనుమతించడంతో ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు మొత్తం నగదు పరిమితి రూ. 25,000గా ఉన్నప్పటికీ, అధిక విలువ కలిగిన నోట్లను అనుమతించడం వల్ల సరిహద్దుల్లో నగదు లావాదేవీలు సులభతరం కానున్నాయి. ఇతర విదేశీ కరెన్సీల విషయంలో ఎటువంటి డిక్లరేషన్ లేకుండా 5,000 డాలర్ల వరకు దేశంలోకి తీసుకువచ్చే నిబంధన యధాతథంగా కొనసాగుతుంది.

# రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలి



అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. ఐజీ ఎస్.కిరణ్? నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు చేస్తోందని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సిట్‌లో ఐదో సభ్యుడిగా ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని ఆదేశించారు. విరాళాల నిధుల మళ్లింపు, రికార్డుల తనిఖీకి ఫోరెన్సిక్ నిపుణుడి అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తును వేగవంతం చేయాలని సిట్‌ను ఆదేశించిన ధర్మాసనం, రెండు వారాల్లో దర్యాప్తు పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అయితే విరాళాల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. సిట్ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు కీలక విషయాలు వెల్లడించారు. "మేము ఇన్?స్పెక్టర్? జనరల్ ఆఫ్? పోలీస్? కిరణ్? ఎస్? నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశాం. ఇందులో ఒక డిప్యూటీ ఇన్?స్పెక్టర్? జనరల్ (డీఐజీ), ఒక సీనియర్? సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్? (ఎస్?ఎస్?పీ), ఒక అడిషనల్ సూపరింటెండెంట్? ఆఫ్ పోలీస్? (ఏఎస్?పీ) ఉన్నారు. ఈ బృందంలో ఫోరెన్సిక్? ఆడిటర్?ను కూడా భాగం చేస్తాం. జులై 25న ఏర్పాటైన ఈ సిట్ ప్రస్తుతం ఈ? కేసును దర్యాప్తు చేస్తోంది " అని చెప్పారు. ఇక పిటిషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్? దేవదత్? కామత్ తన వాదనలు వినిపిస్తూ, "ప్రజలు రూ.500, రూ.1000 నోట్లను విరాళాలుగా ఇచ్చారు. కానీ ఆ డబ్బు ట్రస్ట్?కు చేరలేదు. ట్రస్ట్?కు లభించిన మొత్తాన్ని వెబ్?సైట్?లో ఉంచితే, తమ డబ్బు ఎక్కడకు చేరిందో ప్రజలు తెలుసుకుంటారు. ఇదేమీ లిటిగేషన్? వ్యాజ్యం కాదు" అని అన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం సిట్?కు అన్ని వివరాలు పరిశీలించే అవకాశం ఉంటుందని, పైగా ప్రస్తుతానికి ఈ కేసును క్లోజ్ చేయడం లేదని పేర్కొంది. "ప్రస్తుతానికి మీరంతా సమస్యలను నోట్ చేసుకోండి. ఇప్పుడు మా పూర్తి దృష్టి దర్యాప్తుపైనే ఉంది. మనకు వేగవంతమైన, నాణ్యమైన దర్యాప్తు అవసరం. మూకు నివేదిక సమర్పించమని వారిని అడుగుతున్నాం. మిగిలిన విషయాలను మేము తర్వాతి దశలో నిర్ణయిస్తాం" అని బెంచ్? స్పష్టం చేసింది.

**రాజకీయం చేయొద్దు**

ఇంతకు ముందు అయోధ్య రామమందిర విరాళాల కేసుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయవద్దని, కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని స్పష్టం చేసింది. ఇది ఒక సాధారణ నేరమని, తాము సరైన మార్గంలో దర్యాప్తు జరిగేలా చూస్తామని తెలిపింది. కాగా, ఈ కేసు దర్యాప్తునకు యూపీ గవర్నమెంట్ ఓ సిట్?ను ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు దానిపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ వెల్లడించారు. దీనితో సుప్రీంకోర్టు తదుపరి విచారణను జులై 27కు వాయిదా వేసింది.

సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్? వి.మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసుపై విచారణ చేసింది. ఈ సందర్భంగా అయోధ్య రామమందిర విరాళాల అక్రమాలపై విచారణ సిట్? చేయవచ్చా? అని ఉత్తరప్రదేశ్? ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. అంతకుముందు సొలిసిటర్ జనరల్ మెహతా మాట్లాడుతూ, కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఉత్తరప్రదేశ్? రాష్ట్ర ప్రభుత్వం స్టేటస్? రిపోర్టు దాఖలు చేసిందని తెలిపారు. "దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటి వరకు 8 మందిని అరెస్టు చేశారు. నేను అంత కంటే ఎక్కువ వివరాలు వెల్లడించలేను" అని అన్నారు. దీనితో కేసును సిట్? దర్యాప్తు చేస్తోందా? అని కోర్టు ప్రశ్నించగా, "నిజానిజాలను తెలుసుకోవడానికి మాత్రమే సిట్? ఏర్పాటు చేశారు. ఇప్పుడు దీనిని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో ఒక నేరం జరిగిందని మాత్రమే సిట్? కనిపెట్టింది" అని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

## ఆకివీడు రామాలయానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్



పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ప్రతిపాదిత రామాలయ నిర్మాణానికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో నిర్మాణానికి మార్గం సుగమమైంది. జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రం చట్టబద్ధమేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వ స్థలంలో నిబంధనల మేరకు ఆలయ నిర్మాణం చేపట్టడంలో ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంది. ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌లో బలం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వ భూమిలో నిబంధనలకు అనుగుణంగా ఆలయం నిర్మించేందుకు అనుమతి ఇవ్వడంలో తప్పేమీ లేదని వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పును స్థానికులు, భక్తులు స్వాగతించారు. ఆలయ నిర్మాణ పనులు ఇక వేగం పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ తీర్పు రామభక్తులకు ఆనందాన్ని కలిగించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు హర్షం వ్యక్తం చేశారు. "ఆకివీడులో రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. సత్యం గెలిచింది. ధర్మం గెలిచింది. శ్రీరాముడు గెలిచాడు. జై శ్రీరామ్" అంటూ 'ఎక్స్' వేదికగా స్పందించారు

## యుద్ధ విరామంతో దిగొచ్చిన చమురు ధరలు



అమెరికా–ఇరాన్ మధ్య వారాంతంలో సైనిక దాడులు నిలిచిపోవడంతో అంతర్జాతీయ ముడి చమురు ధరలు సోమవారం భారీగా తగ్గాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర ఏకంగా ఏడు శాతం మేర పడిపోగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) చమురు కూడా ఏడు శాతం వరకు తగ్గింది. దీంతో గత మూడు వారాలుగా కొనసాగిన భారీ ర్యాలీకి తాత్కాలిక బ్రేక్ పడింది. ఇరాన్ ఇకపై అమెరికా దాడులు జరగనంత వరకు తాము కూడా దాడులకు దిగబోమని సంకేతాలు ఇవ్వడంతో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న అంచనాలు మార్కెట్‌లో పెరిగాయి. దీంతో బ్రెంట్ చమురు ధర బ్యారెల్‌కు సుమారు 91 డాలర్ల వద్దకు, డబ్ల్యూటీఐ ధర 85 డాలర్ల దిగువకు చేరింది. గత వారంలో హర్మ్యూజ్, బాబ్ ఎల్ మండెబ్ జలసంధుల్లో సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందనే భయంతో బ్రెంట్ ధర 100 డాలర్ల మార్కును దాటిన విషయం తెలిసిందే. అయితే ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎర్ర సముద్రంలోని సౌదీ అరామ్‌కో చమురు కేంద్రాలపై హౌతీ తిరుగుబాటుదారుల దాడులు భౌగోళిక ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నట్లు సూచిస్తున్నాయని పేర్కొంటున్నారు. హర్మ్యూజ్ జలసంధి మీదుగా రవాణా కూడా ఇంకా పూర్తిగా సాధారణ స్థితికి రాలేదని గుర్తుచేస్తున్నారు.

# ‘సర్’కూ ఇది ఉపయుక్తం

-మొదటిపేజీ తరువాయి

నిర్ణయించింది. ఈ మేరకు ‘తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్’ను ఏర్పాటు చేయడంతో పాటు మీ సేవ కేంద్రాల ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీకి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ జారీ చేసిన జీవో నం:172 ప్రకారం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి.

పౌరసరఫరాల శాఖ ద్వారా తీసుకునే డేటాబేస్‌లోని రేషన్‌కార్డులో ఉన్న కుటుంబ సమాచారాన్ని రిజిస్టర్‌లో నమోదు చేస్తారు.

--ఈ రిజిస్టర్ కానీ, సర్టిఫికెట్ కానీ దేనికీ అధీకృతం కాదు. కేవలం డేటాబేస్‌లో ఆ కుటుంబ వివరాలను నమోదు చేసుకునేందుకు మాత్రమే ఉపయోపడుతుంది. దీని ద్వారా ఎలాంటి హక్కులూ దఖలు పడవు. ఆస్తులపై ఎలాంటి టైటిల్ రాదు. చట్టపరమైన వారసత్వాన్ని ధ్రువీకరించదు. ప్రభుత్వ పథకాల్లో లబి?ధకి ఉపయోగపడదు.

--నిర్దేశించిన ఫీజును చెల్లించడం ద్వారా మీ సేవా కేంద్రం లేదా ఆన్‌లైన్ పోర్టల్ లేదా మొబైల్ అప్లికేషన్‌లో కుటుంబ సభ్యుడు ఈ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

--ఆ కుటుంబ వివరాల్లో పేరున్న మేజర్ అయిన సభ్యుడు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

--దరఖాస్తు చేసుకున్న రెండు పని దినాల్లో సంబంధిత సర్టిఫికెట్‌ను జారీ చేయాల్సి ఉంటుంది.

--రేషన్‌కార్డులో నమోదై ఉన్న చిరునామా ఆధారంగా సదరు తహశీల్దార్ ఈ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. మీసేవా కేంద్రం నుంచి తహశీల్దార్ లాగిన్‌లోకి నేరుగా దరఖాస్తు వెళుతుంది.

--రేషన్‌కార్డులో నమోదై ఉన్న అన్ని వివరాలను పరిశీలించిన తర్వాత తన డిజిటల్ సంతకంతో సంబంధిత తహశీల్దార్ ఈ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్‌పై ఐడెంటిఫికేషన్ నంబర్ కూడా ఉంటుంది. మీ సేవా కేంద్రాల నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముంటుంది.

--ఇందుకు సంబంధించిన అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ (ఏపీఐ)ను ఏర్పాటు చేసే బాధ్యత ఎలక్ట్రానిక్ సర?వస్ డెలివరీ (ఈఎస్‌డీ) కమిషనర్‌కు అప్పగించారు. రేషన్‌కార్డుల్లోని వివరాలను పౌరసరఫరాల శాఖ సహకారంతో తీసుకుంటారు. ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ సేవ అమలును ఆయా జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షిస్తారు.

**ఫ్యామిలీ రిజిస్టర్‌లో నమోదు చేసే కుటుంబ వివరాలివే:**




1) ఫ్యామిలీ రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్ (ఆ కుటుంబ రేషన్‌కార్డు నంబర్)
2) కుటుంబ యజమాని పేరు
3) కుటుంబ సభ్యులందరి పేర్లు
4) యజమానితో కుటుంబ సభ్యుల బంధుత్వం
5) ప్రతి సభ్యుడి వయసు, పుట్టినరోజు
6) పురుషుడు/స్త్రీ/ఇతరులు
7) ప్రతి సభ్యుడి ఆధార్ కార్డు
8) ఇంటి నంబర్, వీధి, గ్రామం/వార్డు, గ్రామ పంచాయతీ/మున్సిపాలిటీ, మండలం, జిల్లాతో కూడిన కుటుంబ చిరునామా.

**‘సర్’కూ ఇది ఉపయుక్తం**

సర్ 2026 ప్రక్రియలో భాగంగా ఆగస్టు 3 వరకు ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్ల నుంచి స్వీకరించి.. ఆగస్టు 10వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. ముసాయిదా జాబితాలో పేర్లు వచ్చిన వారి వివరాల్లో తేడాలు ఉంటే ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నోటీసులు జారీ చేసి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు(ఈఆర్‌వో) విచారణకు పిలుస్తారు. విచారణకు హాజరైన వారు ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని రుజువుగా సమర్పించాల్సి ఉంటుంది. అందులో 10వ పత్రంగా ఈ ‘ఫ్యామిలీ రిజిస్టర్’సర్టిఫికెట్ కూడా ఉంది. ఏ పత్రాలు లేని వారికి ఇది ఉపయోగపడుతుంది.


# బహు శిరస్సుల జల రాక్షసిలా ‘హైడ్రా’ తీరు

**హైదరాబాద్:** ప్రజల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వ సంస్థలు చట్టాన్ని అతిక్రమించే స్థాయికి చేరుకుంటే అది దేశానికే ప్రమాదకరం. కోర్టుల ఆదేశాలను పక్కనబెట్టి స్వతంత్ర అధికార కేంద్రాలుగా వ్యవహరిస్తే అది న్యాయవ్యవస్థకు ‘మరణ ఘంటిక’గా మారుతుంది. న్యాయపాలన, రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ప్రభుత్వ సంస్థకు అత్యంత ప్రాథమిక బాధ్యత. న్యాయస్థానాన్ని ప్రజలు ఆశ్రయించడం రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కు. కోర్టు తీర్పు అనుకూలంగా వస్తే వెంటనే ఆ ఫలితాన్ని పొందడం అందులో భాగమే. అయితే ఆ తీర్పు అమలు కానంత వరకు న్యాయం జరగనట్లే లెక్క. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య వైఖరితో వరుసగా ధిక్కార పిటిషన్లు దాఖలవుతున్నాయి. ప్రస్తుతం హైకోర్టులో 9,290 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను ఆ పోస్టు నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తక్షణమే మరో సమర్థ అధికారిని ఆ పోస్టులో నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్పష్టం చేసింది. రంగనాథ్ పదేపదే తమ ఆదేశాలు ఉల్లంఘించి న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించారంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒకే కేసులో మూడు ధిక్కరణ కేసులు నమోదైనా కోర్టు ఆదేశాలపై ఏమాత్రం గౌరవం చూపకపోవడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొంది. ఇలాంటి అధికారి హైడ్రా కమిషనర్‌గా కొనసాగితే రాష్ట్రంలో చట్టబద్ధ పాలన ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. గతంలోనే హెచ్చరించినా ఎలాంటి మార్పు కనిపించలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేసింది.

న్యాయస్థానాల గౌరవాన్ని కాపాడేందుకు ఇలాంటి చర్యలు తీసుకోక తప్పడం లేదని వెల్లడించింది. ఆయన దాఖలు చేసిన క్షమాపణను అంగీకరించబోమంటూ సదరు అఫిడవిట్‌ను కూడా తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా ఏర్పాటు ఉద్దేశం మంచిదే కానీ, ఎవరైనా చట్టాన్ని పాటించాల్సిందేనని తేల్చిచెప్పింది. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట భూ వివాదంలో శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన ధిక్కార కేసుపై జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా క్షమాపణ కోరుతూ రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రభుత్వం తరఫున ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి, పిటిషనర్ తరఫున న్యాయవాది హరీశ్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం న్యాయమూర్తి ఉత్తర్వులు వెలువరించారు.

**తీర్పులు అమలు కాకపోతే హక్కులు నిరర్థకం**

‘ప్రజాస్వామ్య వ్యవస్థలో కోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం ఎంత గౌరవిస్తుందనేదే దాని నిబద్ధతకు నిజమైన కొలమానం. న్యాయస్థానాల గౌరవం వాటి తీర్పులను వెంటనే అమలు చేయడంలోనే ఉంటుంది. కోర్టు ఉత్తర్వులు వెంటనే అమలైతేనే పౌరుడు న్యాయం పొందుతారు. అమలు చేయకుండా ఆలస్యం చేయడం కోర్టు ధిక్కరణే. తీర్పులు అమలు కాకపోతే రాజ్యాంగ బద్ధమైన హక్కులే నిరర్థకంగా మారతాయి. ప్రభుత్వ యంత్రాంగంలో వాటి అమలును పర్యవేక్షించే సమర్థమైన వ్యవస్థ ఉండాలి. గ్రీకు పురాణాల్లోని ‘హైడ్రా’అనే బహుశిరస్సుల జల రాక్షసిలా ఈ హైడ్రా మారుతోంది. ఒక తల నరికితే మరిన్ని తలలు పుట్టే భీకర జీవి అది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం, మరో ధిక్కరణ పిటిషన్ దాఖలు కావడం ఇదే తరహాలో కనిపిస్తోంది. అంత పెద్ద రాక్షసిపై అక్కడ న్యాయమే గెలిచింది. అలాగే కోర్టులు కూడా చట్ట పరిపాలనను కాపాడటంలో వెనక్కి తగ్గవు. హైడ్రా అనే పేరుతో పనిచేసే సంస్థ కూడా చట్టంపై పైచేయి సాధించలేదని గుర్తుంచుకోవాలి.




**ఒకే అధికారి.. 63 ధిక్కరణ కేసులు**

2016లో దాఖలైన రిట్ పిటిషన్‌పై కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత కూడా వాటిని అమలు చేయకపోవడంతో 2021లో తొలి ధిక్కరణ కేసు.. 2026లో మరోసారి అదే అంశంపై రెండో ధిక్కరణ కేసు.. ప్రస్తుతం మూడోసారి కూడా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడంతో ఈ ధిక్కరణ కేసు విచారణకు వచ్చింది. రిట్ పిటిషన్, అప్పీల్, సివిల్ సూట్, సిటీ సివిల్ కోర్టు అప్పీల్ వరకు అన్ని దశల్లోనూ పిటిషనర్‌కు అనుకూలంగానే తీర్పులు వచ్చినా, వాటిని గౌరవించకుండా వ్యవహరించడం అత్యంత విచారకరం. హైడ్రా కమిషనర్‌పై మొత్తం 63 ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకటిన్నర నుంచి రెండేళ్ల వ్యవధిలో ఒకే అధికారిపై ఇన్ని కేసులు రావడం సాధారణ విషయం కాదు. ఇలాంటి కేసులను విచారించడానికే కోర్టులు ఎంతో విలువైన సమయం వెచ్చించాల్సి వస్తోంది. కోర్టు ఉత్తర్వులను అధికారులు గౌరవించకపోతే న్యాయవ్యవస్థ ఎలా పనిచేస్తుంది? కోర్టులు ప్రజల హక్కులను కాపాడటానికే ఉన్నాయి. ప్రభుత్వ సంస్థలు లేదా అధికారులు దాని ఉత్తర్వులను ధిక్కరించి, పౌరుల హక్కులను కాలరాస్తే.. అది న్యాయవ్యవస్థకే సవాలుగా మారుతుంది. అలాంటి పరిస్థితిని కోర్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోవు.

**క్షమాపణ అంగీకరించే పరిస్థితి లేదు..**

రెండో ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా.. పిటిషనర్ ఆస్తిలోకి హైడ్రా అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశించబోరని స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా కోర్టుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ హామీని ఉల్లంఘించి మళ్లీ అదే చర్యలకు పాల్పడటం ఉద్దేశపూర్వక ధిక్కరణకు నిదర్శనం. ఇది సాధారణ తప్పిదం కాదు. కోర్టు ఆదేశాలు తెలిసీ ధిక్కరించిన చర్యగా పరిగణించాల్సి వస్తుంది..’ అని న్యాయమూర్తి పేర్కొన్నారు. రంగనాథ్ దాఖలు చేసిన క్షమాపణ అఫిడవిట్‌ను జడ్జి పరిశీలించారు. ‘నిజమైన క్షమాపణ అంటే పశ్చాత్తాపంతో వెంటనే చెప్పేది. కోర్టు శిక్ష విధించబోతోందని తెలిసిన తర్వాత చెప్పే క్షమాపణకు విలువ ఉండదు. అది పశ్చాత్తాపం కాదు. శిక్ష నుంచి తప్పించుకోవడానికి చేసే ప్రయత్నం మాత్రమే..’ అని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పులను ఉటంకించారు. ఆ క్షమాపణను అంగీకరించే పరిస్థితి లేదన్నారు. పరిపాలనకు ఇచ్చే అధికారాలు ఎంత గొప్పవో, వాటిని దుర్వినియోగం చేస్తే అంతే ప్రమాదకరంగా మారతాయని స్పష్టం చేశారు. పక్షపాతంతో వినియోగిస్తే రాష్ట్ర ప్రజల హక్కులపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

**అసాధారణ పరిస్థితుల్లో అసాధారణ సూచన**

కోర్టు ఆదేశాల వరుస ఉల్లంఘన, హామీలను పాటించకపోవడం, ధిక్కరణ కేసులు పెరుగుతుండటం లాంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాత హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగడం సముచితం కాదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ‘గతంలో ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు కనిపించని అధికారిని కొనసాగిస్తే.. చట్టబద్ధ పాలన ప్రమాదంలో పడుతుంది. ఈ నేపథ్యంలో రంగనాథ్‌ను తొలగించి, మరొకరిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని సీఎస్‌కు సూచిస్తున్నాం. అసాధారణ పరిస్థితుల్లో ఇలాంటి అసాధారణ సూచన చేయాల్సి వస్తోంది. హైకోర్టుకు ఆర్టికల్ 215తో పాటు ధిక్కరణ చట్ట ప్రకారం ధిక్కారంపై చర్యలు తీసుకునే అధికారం ఉంది. ప్రజా ఆస్తుల రక్షణ ప్రాధాన్యమే అయినా.. అది చట్టబద్ధంగానే జరగాలి. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ అధికారులు చేపట్టిన చర్యలతో ప్రభుత్వం లేదా పౌరులకు నష్టం జరిగితే, దాన్ని ప్రభుత్వ ఖజానాపై మోపకుండా, బాధ్యులైన అధికారుల వ్యక్తిగత బాధ్యతగా పరిగణించాలి..’ అని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో వెల్లడించారు.

## ల్యాండ్ మాఫియా, కబ్జాదారులు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు : రంగనాథ్

తనపై ఉన్న 63 కంటెంప్ట్ కేసులు బడా భూకబ్జాదారులు వేసినవే అని హైడ్రాకమిషనర్? రంగనాథ్ వెల్లడించారు. రూ. లక్షల కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములు కాపాడామని ఆయన అన్నారు. హైడ్రా కమిషనర్ స్థానం నుంచి రంగనాథ్?ను తప్పించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. హైడ్రా కమిషనర్‌గా చెరువులు, పార్కులు రక్షించానని రంగనాథ్ పేర్కొన్నారు. రూ. 1.50 లక్షల కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములు కాపాడామని వెల్లడించారు. చెరువులు, పార్కులు, వేల ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడామని తెలిపారు. బడా బాబులు ఆక్రమించిన వందల ఎకరాలను ధైర్యంగా కాపాడినట్లు చెప్పుకొచ్చారు. ల్యాండ్ మాఫియా, కబ్జాదారులు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. శాంతా శ్రీరామ్ అనే స్థిరాస్తి సంస్థ లోతుకుంట భూమి కొట్టేయాలని చూసిందని ఆరోపించారు. సుమారు రూ. 10 వేల కోట్ల విలువైన భూమిని కొట్టేయాలని చూసిందని పేర్కొన్నారు. అనుమతి లేకుండా హెరిటేజ్ గుట్టలను బ్లాస్టింగ్ చేస్తున్నారని విమర్శించారు. శాంతా శ్రీరామ్ సంస్థ చెట్లు, గుట్టలను విచ్చలవిడిగా విధ్వంసం చేసిందని వెల్లడించారు. సేవ్ ది రాక్స్ సొసైటీ ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగిందని స్పష్టం చేశారు. తన పై ఉన్న 63 కంటెంప్ట్ కేసులు బడా భూకబ్జాదారులు వేసినవే అని రంగనాథ్ వెల్లడించారు. బతుకమ్మకుంట చెరువును మింగేయాలని ఒకరు చూశారని, రూ.వేల కోట్ల విలువైన లోతుకుంట భూమిని కొట్టేయాలని మరొకరు చూశారని ఆయన స్పష్టం చేశారు. సామాన్యుల ప్లాట్లు కొట్టేసి బడా కాంప్లెక్సులు కట్టాలని సంధ్యా శ్రీధర్‌రావు చూస్తున్నారని ఆరోపించారు. సింగరేణి కార్మికుల ప్లాట్లను కొట్టేయాలని నల్ల మల్లారెడ్డి చూశారని రంగనాథ్ ఆరోపించారు. విలువైన సామాన్యుల ప్లాట్లు, ప్రభుత్వ భూములను ముఖీం ఆక్రమించారని మండిపడ్డారు. అక్రమార్కులందరికీ హైడ్రా కమిషనర్‌గా అడ్డు పడడటమే నేను చేసిన తప్పిదమని తన ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణకు 13వ స్థానం

-మొదటిపేజీ తరువాయి

తమిళనాడు (53.3), ఒడిశా (52.4), మధ్యప్రదేశ్ (48.9) ఉండగా, ఆంధ్రప్రదేశ్ (48.7), కర్ణాటక (48.7), రాజస్తాన్ (48.1), ఛత్తీస్‌గఢ్ (47.5 మార్కులు) రాష్ట్రాలు తెలంగాణ కంటే ముందు వరుసలో నిలిచాయి. దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో పెట్టుబడులకు ఉన్న అనుకూలతపై ఆరు కేటగిరీల్లో పరిశీలన జరిపిన అనంతరం నీతి ఆయోగ్ ఈ మేరకు ర్యాంకులు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన కొన్ని అంశాలు తెలంగాణకు సానుకూలంగా ఉండగా, మరికొన్ని ప్రతికూలంగా ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించడం గమనార్హం.

**టీఎస్--ఐపాస్‌కు గుర్తింపు**

పెట్టుబడులకు వివిధ రాష్ట్రాల్లో అనుకూలత విషయంలో పలు అంశాల్లో నీతి ఆయోగ్ అధ్యయనం చేసింది. మొత్తం 84 సూచికల్లో 1,850 మంది పెట్టుబడిదారుల అభిప్రాయాలు, 165 భాగస్వామ్య సంస్థల సూచనలను పరిగణనలోకి తీసుకుంది. దీంతో పాటు కీలకమైన మౌలిక వసతుల కల్పన, వ్యాపార అనుకూల వాతావరణం, వనరులు, ప్రభుత్వ విధానాలు, సౌలభ్యాలు, ఆర్థిక ఆరోగ్యం, సంస్థాగత వ్యవస్థ, పర్యావరణ స్థిరత్వం వంటి సూచికల్లో పాయింట్లు కేటాయించింది. ప్రభుత్వ విధానాలు, వ్యాపార అనుకూల పరిస్థితులు, ఆర్థిక ఆరోగ్యం కేటగిరీల్లో ఈ నివేదిక తెలంగాణకు మంచి మార్కులు ఇచ్చింది. దేశంలోనే అత్యంత సమర్థవంతమైన సింగిల్ విండో వ్యవస్థల్లో టీఎస్--ఐపాస్ ఒకటిగా ఈ నివేదిక గుర్తించింది. దక్షిణ మధ్య రైల్వే కేంద్రంగా ఉండటం, కాజీపేట, సనత్‌నగర్ ప్రాంతాల్లో సరుకు రవాణా సామర్థ్యం పెరగడం వల్ల పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని తెలిపింది.

**సేవా రంగం ప్రధాన బలం**

రాష్ట్ర ఆర్థిక నిర్మాణంలో సేవారంగం ప్రధాన బలంగా నిలుస్తోందని, తెలంగాణలో తలసరి జీఎస్‌డీపీ రూ.2,17,801గా ఉండగా, పరిశ్రమల వాటా 22.5 శాతం, సేవారంగం వాటా 69.3 శాతంగా నమోదైందని, 3.03 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించిందని, ఔషధాలు, మెడిసినల్ కెమికల్స్, బయోటెక్ రంగాలు తెలంగాణ ప్రధాన పరిశ్రమలుగా ఉన్నాయని పేర్కొంది. తెలంగాణకు పారిశ్రామిక బలాలతో పాటు బలహీనతలు కూడా ఉన్నాయని, సంస్థాగత వాతావరణం, మౌలిక సదుపాయాల కల్పన విభాగాల్లో రాష్ట్రం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది. విరివిగా భూముల లభ్యత ఉన్నా 2022 నాటికే సైబర్, ఆర్థిక నేరాలతో ప్రతికూల వాతావరణం ఏర్పడిందని తెలిపింది. పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారడం, సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, ప్రభుత్వ సేవల నాణ్యతను మరింత బలోపేతం చేయడం ద్వారా పెట్టుబడులను ఇంకా పెద్దఎత్తున ఆకర్షించే అవకాశం ఉందని కూడా విశ్లేషించింది.

## ‘మరి రేవంత్ రాజీనామా చేయరా?’

**ఢిల్లీ:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మరోసారి ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ విద్యాశాఖ మంత్రిగా ఉండగానే టెన్త్ క్లాస్ పేపర్ లీక్ అయ్యిందని, మరి నీతులు మాట్లాడుతున్న ఆయన ఎందుకు రాజీనామా చేయరని ప్రశ్నించారు. ముందు సీఎం రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ నుంచి మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. దేశ హితం కోసం ఏ వ్యవస్థ వచ్చినా తప్పులేదని, దేశానికి నష్టం చేసే వ్యవస్థ మాత్రం ఉండకూడదన్నారు. నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్ట్స్ అని అన్నారు. దేశం డిజిటల్ చెల్లింపుల్లో అగ్రస్థానంలో ఉందన్నారాయన. తాము అధికారంలోకి వస్తే తెలంగాణలో చాలా మార్పులు వస్తాయన్నారు కిషన్‌రెడ్డి. తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరగబోతున్నాయని, భవిష్యత్తులో ప్రధాని ,హోంమంత్రి అందరూ నేతలు తెలంగాణలో పర్యటిస్తారన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కి భూమి పూజ చేయాలని, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ప్లానింగ్ జరుతుందన్నారు.

## నిమ్స్‌లో బ్రెయిన్ స్టిమ్యూలేషన్ సర్జరీ
## 2 గంటల్లోనే శస్త్ర చికిత్స




పార్కిన్సన్స్, వణుకు, ముత్రాశయ నరాల వ్యాధులకు నిమ్స్?లో అధునాతన శస్త్ర అందుబాటులోకి వచ్చాయి. కార్పొరేట్?లో రూ.లక్షలు ఖర్చు అయ్యే ఈ చికిత్సలను ఆరోగ్యశ్రీలో ఉచితంగా సాధారణ రోగులకు అతి తక్కువ ఖర్చు చేస్తున్నారు. గతంలో 5-6 గంటలు పట్టే సంక్లిష్టమైన డీప్? బ్రెయిన్? స్టిమ్యూలేషన్ (డీబీఎస్) చికిత్సను 1-2 గంటల్లోనే విజయవంతంగా పూర్తి చేసే విధానం అందుబాటులోకి తెచ్చినట్లు న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా.వై.వంశీకృష్ణ తెలిపారు. వీటితో పాటు ఎసెన్షియల్ ట్రెమర్ అంటే చేతులు, శరీరం వణకడం, డిస్టోనియా వంటి మూవ్?వెంట్? డిజార్డర్లతో బాధపడే రోగులకు అతితక్కువ సమయంలో డీబీఎస్ చేస్తున్నట్లు తెలిపారు.

ఇంతకముందు ఆపరేషన్ సమయంలో మెదడు నరాల స్పందనను గమనించడానికి రోగిని స్పృహలోనే ఉంచి, స్థానిక మత్తు ఇచ్చి గంటల తరబడి సర్జరీ చేసేవారు. ఇలా చేయడంతో రోగులు నరకం అనుభవించే వారు. లండన్?లో శిక్షణ పొందిన నిమ్స్? న్యూరాలజీ బృందం జనరల్? అనస్థిషియా ఇచ్చి నొప్పి, ఆందోళన లేకుండా అతి తక్కువ సమయంలో పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. శస్త్రచికిత్సకు ముందే అత్యాధునిక ఇమేజింగ్? సాయంతో బ్రెయిన్‌లోని నిర్దిష్ట భాగాలను డిజిటల్‌గా మ్యాపింగ్ చేసి, పక్కా ప్రణాళికతో వ్యాధికి కారణమైన నరాలను స్తంభింపజేస్తారు.

**200లకుపైగా డీబీఎస్ శస్త్ర చికిత్సలు**

దాని ఫలితంగా వణుకును నియంత్రించేందుకు ఎలాంటి పరికరం అమర్చాల్సిన అవసరముండదని డా.వంశీకృష్ణ తెలిపారు. వణుకు, పార్కిన్సన్స్?తో బాధపడే పలువురికి విజయవంతంగా సర్జరీ చేశామన్నారు. రెండున్నరేళ్లలో నిమ్స్?లో న్యూరోసర్జరీ విభాగం 200కిపైగా ఈ 3 సమస్యలకు డీబీఎస్? శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేసింది. దేశంలో ఈ రకమైన చికిత్సలు అందిస్తున్న ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఒకటిగా నిలిచింది. తక్కువ వ్యవధిలో అత్యంత కచ్చితత్వంతో రోగులకు చికిత్సలు అందిస్తున్నాం. అత్యంత నాణ్యతతో కూడిన ఫంక్షనల్? న్యూరో సర్జరీ చికిత్సలను అందించడమే మా ముందున్న లక్ష్యం. పేదలకు పూర్తి ఉచితం”

**సరికొత్త చికిత్సలు ఇవే! :**

**రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్**

మందులతో తగ్గని తీవ్రమైన వణుకు సమస్యకు ఎంఆర్? గైడెడ్? రేడియో అబ్లేషన్? చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో వణుకు తగ్గించేందుకు పరికరాన్ని శరీరం లోపల అమర్చేవారు. అక్కడ నుంచి రేడియో సిగ్నల్స్? అందించి మెదడులోని నరాలను నియంత్రించేవారు. కొత్త విధానంలో ఎలాంటి పరికరాలు అమర్చకుండానే మెదడులోని డెంటాటో రూబ్రో థాలామిక్? మార్గాన్ని గుర్తించి రేడియోఫ్రీక్వెన్సీ ద్వారా వణుకుకు కారణమయ్యే నరాలనే స్తంభింప చేస్తారు.

**సాక్రల్ న్యూరో మాడ్యులేషన్?**

న్యూరోజనిక్ బ్లాడర్‌తో బాధపడే వారికి తెలియకుండానే మూత్రం పోతుంది. ఇలాంటి రోగుల కోసం సాక్రల్? న్యూరో మాడ్యులేషన్? సేవలను అందుబాటులోకి తెచ్చారు. దీనికి కారణమయ్యే నరాలను నియంత్రణలో తెచ్చి ఉపశమనం కల్పిస్తారు.

# సంపాదకీయం

## రాజకీయంగా ప్రభావం చూపే స్థాయికి సీజేపీ

భారత రాజకీయ చరిత్రలో ఎన్నో చిత్ర విచిత్రమైన ఉద్యమాలు వచ్చాయి గానీ, కాక్రోచ్ జనతా పార్టీ సృష్టించిన రాజకీయ సంచలనం బహుశా మునుపెన్నడూ లేదనడంలో సందేహం లేదు. ధర్మేంద్రప్రధాన్‌ను రాజీనామా చేయించడంలో కీలక పాత్ర పోషించారు. చివరికి కేంద్ర ప్రభుత్వాన్ని మోకాళ్లపైకి తెచ్చింది. మోదీ ప్రభుత్వం ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. సోషల్ మీడియా మీమ్‌గా పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి తలొగ్గి కేంద్రం ఒక కేబినెట్ మంత్రిని పదవి నుంచి తప్పించడం అంటే, సీజేపీ డిమాండ్లకు మాత్రమే కాదు.. దాని రాజకీయ ఉనికికి కూడా కేంద్రం స్వయంగా చట్టబద్ధత కల్పించినట్లయింది.కేవలం విద్యార్థి పోరాటాలు, మీమ్‌లు, సోషల్ మీడియా క్యాంపెయిన్లకే పరిమితమైన సీజేపీ, ఇప్పుడు అధికారికంగా రాజకీయ పార్టీగా అవతరిస్తే భారత రాజకీయాలు ఏ విధంగా మారతాయనేది ప్రస్తుతం ఢిల్లీ పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికరమైన టాపిక్. గతంలో అన్నా హజారే ఇండియా అగైన్స్ట్ కరప్షన్ ఉద్యమం నుంచి ఉద్భవించిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎలాగైతే ఒక రాత్రిలో సాంప్రదాయ రాజకీయాలను కుదిపేసిందో, ఇప్పుడు సీజేపీ కూడా సరిగ్గా అదే తరహా యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ ఎనర్జీతో ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజకీయ ఆశలు లేవని చెబుతున్నారు కానీ.. రేపు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చెప్పడం కష్టం. యువత, ముఖ్యంగా జెన్-జీ , మిలీనియల్స్ అండగా ఉన్న ఈ పార్టీ పొలిటికల్ ఎంట్రీ.. ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రతిపక్షాలకు సింహస్వప్నంగా మారనుంది.వాస్తవానికి, సీజేపీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తే భయపడాల్సింది అధికార బీజేపీ కంటే కూడా కాంగ్రెస్ , ఆమ్ ఆద్మీ పార్టీలే. ఎందుకంటే, కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, యువత సమస్యలైన నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, విద్యావ్యవస్థలోని లోపాలపై పోరాడే విపక్ష స్పేస్ ని ఇన్నాళ్లూ కాంగ్రెస్, ఆప్‌లు ఆక్రమించే ప్రయత్నం చేశాయి. అయితే, రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ కానీ, వరుస వివాదాల్లో చిక్కుకున్న ఆప్ కానీ సాధించలేని భారీ రాజకీయ విజయాన్ని సీజేపీ సాధించి చూపించింది. దీనివల్ల ప్రతిపక్షాల వైపు ఉండాల్సిన యువతరం డిజిటల్ అటెన్షన్, అర్బన్ ఓటు బ్యాంకు మొత్తం సీజేపీ వైపే మొగ్గు చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.కాంగ్రెస్ విషయానికొస్తే, నగరాల్లోని విద్యాధికులు, యువత ఓట్లను రాబట్టడానికి ఆ పార్టీ ఎంతో కాలంగా పడుతున్న కష్టాలు సీజేపీ ఎంట్రీతో బూడిదలో పోసిన పన్నీరు కానున్నాయి. విద్యార్థుల కోసం తాము క్షేత్రస్థాయిలో ఏమీ చేయలేకపోయామనే భావన ఓటర్లలో బలపడటం కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ. మరోవైపు, తమను తాము విద్యార్థుల, మధ్యతరగతి ప్రతినిధులుగా ప్రొజెక్ట్ చేసుకునే ఆమ్ ఆద్మీ పార్టీ ఉనికికే సీజేపీ పెను సవాలుగా పరిణమించనుంది. ఆప్ పాతబడిపోయిన ఫార్ములా స్థానంలో, సరికొత్త డిజిటల్ టెక్నాలజీ, సోషల్ మీడియా స్ట్రాటజీలతో దూసుకొస్తున్న సీజేపీ, ఢిల్లీ , ఇతర మెట్రో నగరాల్లో ఆప్ ఓట్ బ్యాంక్‌ను ఎసరు పెట్టడం ఖాయం.ఈ సరికొత్త పరిణామం ప్రధాని నరేంద్ర మోదీ మాస్టర్ స్ట్రోక్‌లో భాగమనే విశ్లేషణలు కూడా లేకపోలేదు. .అభిజిత్ దీప్కే ప్రారంభించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 6న తన తొలి నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల్లో అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నిరసనకారులు ఆందోళన లేవనెత్తారు. ఆ ఆందోళన ఒక పెద్ద ఉద్యమానికి ఆరంభం మాత్రమేనని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో, జూన్ 20న కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరసనను ప్రారంభించారు.పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావడం తదితర డిమాండ్లను కేంద్రం ముందుంచారు.అయితే, 'పార్లమెంట్ మార్చ్'కు సీజేపీ ఎలాంటి అనుమతి కోరలేదని, పోలీసులు అనుమతి ఇవ్వలేదని జులై 19న ఢిల్లీ పోలీసులు ప్రకటించారు.జులై 20న, వేలాది మంది నిరసనకారులు జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లడానికి ప్రయత్నించారు.ఆ సమయంలో గుంపును చెదరగొట్టడానికి పోలీసులు బారికేడ్లు, లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఆ ఘటనలో కొందరు యువకులు, పోలీసులు గాయపడ్డారు. దీంతో, పోలీసుల తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయికొన్ని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు కూడా దీనిపై ఆందోళన వ్యక్తం చేశాయి.ఆ తర్వాత జులై 21 నుంచి 23 మధ్య, జంతర్ మంతర్ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు, పలు మెట్రో స్టేషన్లను మూసివేశారు.పోలీసుల చర్యలపై ఢిల్లీ హైకోర్టు వివరణ కోరింది. ఆ తర్వాత కేంద్ర మంత్రులు నిరసన స్థలానికి సమీపంలోని ఒక తటస్థ ప్రదేశంలో సీజేపీ ప్రతినిధులతో చర్చలు ప్రారంభించారు.జులై 24న, సోనమ్ వాంగ్‌చుక్ ప్రభుత్వ హామీల నేపథ్యంలో జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో తన నిరాహార దీక్షను విరమించారు.అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీజేపీ ప్రకటించింది.డిమాండ్లపై సమాధానం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఒకరోజు వరకు సమయం కోరిందని జులై 24న జరిగిన చర్చల ముగింపులో సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు.జవాబుదారీతనం, పరీక్షా విధానంలో సంస్కరణల డిమాండ్లను స్పష్టంగా చెబుతూనే, ఈ పరిణామాన్ని సీజేపీ ఒక భారీ విజయంగా అభివర్ణించింది"ఇది ప్రజాస్వామ్య విజయం, ఇది శాంతి, ఓర్పు, పట్టుదలకు లభించిన విజయం" అని సోనమ్ వాంగ్‌చుక్ వ్యాఖ్యానించారు."ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు, కానీ నీట్ పరీక్ష అక్రమాల కారణంగా ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలి, నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి అనే రెండు డిమాండ్లు ఇంకా మిగిలే ఉన్నాయి" అని అభిజిత్ దీప్కే తెలిపారు.విద్యాశాఖ మంత్రి రాజీనామాను ఆమోదించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మేము ప్రజాస్వామ్యబద్ధంగా స్పందించాం అనే ఇమేజ్‌ను తెచ్చుకోవడమే కాకుండా, విపక్ష ఓట్లను చీల్చే మరొక కొత్త శక్తిని పరోక్షంగా ప్రోత్సహించినట్లయింది. ప్రతిపక్షాల ఐక్యత నీరుగారిపోతున్న తరుణంలో, ఒక స్వతంత్ర యువజన పార్టీ రూపంలో మూడో శక్తి రావడం వల్ల విపక్ష ఓటు బ్యాంకు ఘోరంగా చీలిపోయి, చివరికి అది అధికార పార్టీకే రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందనే భావన ఉంది. కాక్రోచ్ జనతా పార్టీ రాజకీయ పార్టీగా మారుతుందో లేదే ఎవరికీ తెలియదు. కానీ సాంప్రదాయ రాజకీయ సమీకరణాలు, పాతకాలపు ప్రచార శైలి చెల్లవని, ప్రజల్లోంచి వచ్చిన ఆవేశం సరికొత్త రాజకీయ శక్తులకు జన్మనిస్తుందని ఇది నిరూపించింది. రాబోయే ఎన్నికల్లో సీజేపీ నిజంగానే పార్టీ గుర్తుతో బరిలోకి దిగితే, అది కేవలం విద్యావ్యవస్థలోనే కాదు, దేశ రాజకీయాల్లో కూడా ఒక పెద్ద ప్రక్షాళనకు కారణమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు

# నెగ్గాల్సిన ఇతర పరీక్షలు



యాభై రోజులుపైగా ఢిల్లీలో మహోద్ధృతంగాసాగి, దేశం మొత్తాన్ని సుడిగాలిలా చుట్టేసిన జంతర్ మంతర్ ఉద్యమం ఉపశమించిన మర్నాడే ప్రధాని నరేంద్ర మోదీ పరీక్షల సంస్కరణల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని ఆధ్వర్యాన ఆరుగురు సభ్యుల టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమిస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. అంతేకాదు... పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పబ్లిక్ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లును లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టారు. కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో మొదలెట్టి చకచకా సాగుతున్న ఈ పరిణామాలు... ఆగ్రహంతో రగులుతున్న జెన్ జీ తరాన్ని దగ్గర చేసుకోవటానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాల పర్యవసానమే. నీట్ పేపర్ లీకయిందనీ, మరోసారి ఆ పరీక్ష నిర్వహణ తప్పదనీ తేలిన వెంటనే ఇంతే వేగంగా స్పందించివుంటే బహుశా ఈ స్థాయిలో ఆందోళన జరిగివుండేది కాదేమో! ఆ మాటకొస్తే ఎన్నో యేళ్లుగా ఈ లీకులు వినబడుతూనే ఉన్నాయి. కానీ వ్యవస్థల్లో కదలిక లేదు. 2024 నీట్ ప్రశ్నపత్రం లీక్ తర్వాత మాత్రం ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటైంది. అది ఇచ్చిన నివేదిక అతీగతీ ఏమైందో తెలియదు. ఇంత నిస్తేజంగా ప్రభుత్వాలున్నప్పుడు ఉద్యమాలు వెల్లువెత్తడంలో ఆశ్చర్యం లేదు.

మన దేశంలో సమస్యేమంటే కేంద్రం ఒక్కటే కాదు... రాష్ట్ర ప్రభుత్వాలు సైతం లీకుల విషయంలో నిర్లిప్తంగానే ఉంటాయి. జంతర్ మంతర్ ఉద్యమం ఒకపక్క సాగుతుండగానే పంజాబ్‌లో ఫార్మసీ రిక్రూట్‌మెంట్ పరీక్షల అక్రమాలు బయటపడ్డాయి. ఇక ఎన్డీయే కూటమి ఏలుబడిలోనే సాగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియే పెద్ద కుంభకోణంగా మారింది. నోటిఫికేషన్ విడుదలనాడే స్పోర్ట్స్ కోటా నియామకాలకు అర్హత పరీక్ష అవసరం లేదంటూ రెండు జీవోలు తీసుకురావటం ఆ ప్రభుత్వ బరితెగింపునకు చిహ్నం. అందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం ఏపీ విద్యామంత్రి లోకేశ్ రాజీనామా చేయాలన్న డిమాండ్ బలంగా వినిపించింది.

నందన్ నిలేకని విద్యాధికుడు. ఐటీ రంగంలో పేరెన్నికగన్నవారు. గతంలో మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వం దేశంలో సంక్షేమ పథకాల అమలుకోసమంటూ తీసుకొచ్చిన ఆధార్ కార్డుల రూపకర్త ఆయనే. నిలేకని మాదిరే ఇతర సభ్యులు సైతం వారి వారి రంగాల్లో నిష్ణాతులు. పరీక్షల నిర్వహణకు ఇప్పుడ నుసరిస్తున్న విధానాల్లోని లోటుపాట్లు అధ్యయనం చేసి, ఎలాంటి సంస్కరణలు అవసరమో వీరు సూచిస్తారు. అడుగడుగునా చోటుచేసుకోవటానికి ఆస్కారం ఉన్న అవకతవకలనూ, అనైతిక పద్ధతులనూ నివారించటానికి ఏం చేయాలో చెబుతారు.

వీటన్నిటికన్నా ముందు అసలు పరీక్ష నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వంటి జాతీయ సంస్థ అవసరమా అనే సంగతి నిగ్గుదేల్చటం అవసరం. ఒక సంస్థకు దాని సామర్థ్యానికీ, వనరులకూ మించిన బాధ్యతల్ని అప్పగించటం సరైందేనా? ఆలోచించాలి. రెండేళ్లనాటి రాధాకృష్ణన్ కమిటీ నివేదికలోని అంశాలేమిటో, దాని సిఫార్సులపై తీసుకున్న చర్యలేమిటో చెప్పాల్సిన బాధ్యత పాలకులకు లేదా? కాక్రోచ్ ఉద్యమం సాగుతుండగానే 2024 నీట్ లీక్ ప్రధాన నిందితుడిపై వచ్చిన ఆరోపణలు రుజువు కాలేదని సీబీఐ ప్రకటించటం మరో వైచిత్రి. ఇక విద్యార్థులపై అత్యంత ఘోరంగా బలప్రయోగానికి పూనుకున్నవారిపైనా చర్యలుండాలి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఇకపై అవసరమైన చర్యలు నిరంతరం తీసుకుంటూనే ఉంటుందని ప్రధాని చెప్పటం హర్షించదగ్గది. ఇది కేంద్ర స్థాయిలో మాత్రమే కాదు... రాష్ట్రాల స్థాయిలో కూడా జరగాలి. ఇతర రాష్ట్రాల మాటెలవున్నా తమ ఏలుబడిలోని ప్రభుత్వాలైనా జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ఎన్డీయే పెద్దలకుంది. ప్రధాని హామీ కంటితుడుపు చర్య మాత్రమేనని, రాష్ట్రాల్లో కూడా కాక్రోచ్‌ల స్థాయిలో ఉద్యమిస్తే తప్ప డీఎస్సీ అవకతవకల వంటివి పట్టించుకోబోరన్న సంకేతాలు వెళ్లరాదు. అందుకే దేశంలో యువత మనసు గెలవాలంటే నెగ్గాల్సిన పరీక్షలు చాలానే ఉన్నాయని కేంద్రం గుర్తించాలి.

# కాపాడే పేరిట కాటేసే హైడ్రా!



హైదరాబాద్‌లోని జలవనరుల రక్షణ, అక్రమార్కుల కబ్జాలోని ప్రభుత్వ స్థలాల సంరక్షణ పేరుతో ప్రభుత్వం నిరుడు జూలైలో జీవో 99 ద్వారా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఫోర్స్-హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కాలంలో పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్టు హైడ్రా చెప్పుకొంటున్నది. కానీ హైడ్రా అసలైన కథ వేరే ఉన్నది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టడం వంటి ఉల్లంఘనలు కోకొల్లలు. హైడ్రా చేస్తున్న పనులపై దాఖలైన వివిధ పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్ట్ వరుసగా మొట్టికాయలు వేస్తూనే ఉన్నది. . తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై వేటు వేసింది.

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారం ముందు నుంచీ వివాదాస్పదంగానే ఉన్నది. బుల్డోజర్లను ఉపయోగిస్తూ ప్రభుత్వం సాగిస్తున్న కూల్చివేతల విషయంలో ఆయన తీరు పట్ల ప్రజాగ్రహం పెల్లుబుకుతున్నది. న్యాయస్థానాల ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడపట్ల విపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగనాథ్‌పై దాఖలైన 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తంచేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఆఫీస్ కోర్ట్ ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని, ఆయనను తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు ముందు కూడా రంగనాథ్ తీరు పట్ల హైకోర్ట్ పలుమార్లు మొట్టికాయలు వేసింది. ఇటీవలే ఆయన అరెస్ట్‌కు సైతం ఆదేశాలు ఇచ్చి, న్యాయవాదుల విజ్ఞప్తితో విరమించుకున్నది. హైడ్రా అరాచకాలు, రంగనాథ్ ఉల్లంఘనలపై హైకోర్ట్ చాలాసార్లు ఘాటుగానే స్పందించింది.

కూకట్‌పల్లిలోని 13.17 ఎకరాల విస్తీర్ణంలో కూల్చి వేసిన నిర్మాణాలను హైడ్రానే పునరుద్ధరించాలని జూన్‌లో హైకోర్ట్ తేల్చిచెప్పింది. హైడ్రా దుస్సాహసాన్ని న్యాయస్థానం తీవ్రంగా ఖండిస్తున్నదని జస్టిస్ నాగేశ్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నాయని చెప్పినప్పటికీ రాత్రంతా కూల్చివేతలు జరుపడమేంటని నిలదీసింది. నిర్మాణాల పునరుద్ధరణకు అయ్యే ఖర్చును అధికారుల వ్యక్తిగత నిధుల నుంచి భరించాలని తేల్చిచెప్పింది. ఇది అరుదైన తీర్పు అని చెప్పవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ వృద్ధుడికి చెందిన వ్యవసాయ భూమిలో చేసిన విధ్వంసాన్ని కూడా జస్టిస్ విజయసేన్‌రెడ్డి ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది.

హైడ్రా చర్యలు యుద్ధ పరిస్థితిని తలపించే చర్యలు అని అభివర్ణించింది. జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ చట్టాల ప్రకారం నమోదు చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హైడ్రా చర్యలు సరైన దిశలో లేవని న్యాయమూర్తి స్పష్టంచేశారు. 2025 ఫిబ్రవరిలోనూ జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం మరింత తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ముత్తంగి గ్రామంలో ఓ షెడ్‌ను హైడ్రా కూల్చివేసిన తీరును దొంగల ముఠా చర్యగా పోల్చింది.

రాత్రిపూట రహస్యంగా కూల్చివేతలు జరుగుతున్నాయని, చట్టపరమైన ప్రక్రియను పాటించకపోతే హైడ్రాను మూసివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. ముందస్తు సమాచారం లేకుండా సెలవు రోజుల్లో ఎందుకు కూల్చివేతలకు పాల్పడుతున్నారని నిలదీసింది. హైడ్రా తీరుపై హైకోర్ట్ పదేపదే మొట్టికాయలు వేస్తున్నా, అధికారుల తీరును తప్పుబడుతున్నా ఆ సంస్థ యథేచ్ఛగానే వ్యవహరిస్తున్నది. ఇందుకు నిదర్శనం లోతుకుంటలో హైడ్రా చేపట్టిన కూల్చివేతల పర్వం. ఏవీ రంగనాథ్‌పై శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన మూడో ధిక్కార పిటిషన్ విచారణ సందర్భంగా జూలై 21న కోర్ట్ కీలక వ్యాఖ్యలు చేసింది.

రంగనాథ్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశించింది. అడ్వకేట్ జనరల్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవడంతో ఆ ఆదేశాన్ని వెనక్కి తీసుకున్నది. రంగనాథ్ స్వయంగా కోర్టుకు హాజరు కావాలని తేల్చిచెప్పింది. అదే రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు హైకోర్టులో విచారణకు రంగనాథ్ హాజరయ్యారు. అయితే ఆ తర్వాత కూడా హైడ్రా వ్యవహరించే తీరులో మార్పు రాలేదు. దీంతో ఈ నెల 23న వివాదాస్పద స్థలంలో మోహరించేందుకు సైనిక సిబ్బంది జాబితాను అందించాలని కోరుతూ బైసన్ డివిజన్‌లోని అత్యంత సీనియర్ బ్రిగేడియర్‌ను సంప్రదించాలని కోర్ట్ రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి, ఎవరైనా ఆ స్థలంలోకి ప్రవేశిస్తే వారిని సైనిక సిబ్బంది అదుపులోకి తీసుకోవచ్చుని, వారిలో హైడ్రా సిబ్బంది కూడా ఉంటారని హెచ్చరించింది.

హైడ్రా చీఫ్ తానే ఒక చట్టంలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అయితే, అడ్వకేట్ జనరల్ విజ్ఞప్తి మేరకు సైనిక సిబ్బంది మోహరింపు ఉత్తర్వులను కూడా హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. జలవనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అంటూ హైడ్రా చెప్పుకొస్తున్నది. కానీ వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. హైడ్రా అంటే ఉదయం 4 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేసే సంస్థ అని పేరుమోసింది. కోర్ట్ ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా ధిక్కారణ ధోరణితో ప్రవర్తిస్తూ, ఆ ప్రవర్తననే విజయంగా ప్రచారం చేసుకొనే బృందంగా గుర్తింపు పొందింది.

హైకోర్ట్‌లో 700కు పైగా కేసులు ఎదుర్కొంటున్న హైడ్రా, వివిధ కేసుల్లో విచారణల సందర్భంగా ధర్మాసనాలతో మొట్టికాయలు వేయించుకుంది. హైడ్రాను ఉద్దేశించి అలవాటుపడ్డ నేరగాడిలా, తనకు తానే చట్టంలా, బందిపోటు దొంగల ముఠాను తలపించే సంస్థగా న్యాయమూర్తులు అభివర్ణించారు. అంతేకాదు, హైడ్రా రాజకీయంగా తటస్థంగా వ్యవహరించడంలేదని ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నది.

అధికార పార్టీకి చెందిన నేతల అక్రమ కట్టడాలను హైడ్రా ఎందుకు కూల్చివేయడంలేదని విపక్షనేతలు ప్రశ్నిస్తున్నారు. హైడ్రా చట్టబద్ధమైన నిబంధనలు పాటించడంలేదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం, గడువు అడిగితే నిరాకరించడం, అప్పీల్‌కు అవకాశం కల్పించకపోవడం తీవ్ర అభ్యంతరకరం. కేవలం ప్రభుత్వ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టడం దారుణం. ప్రజల ఆస్తులను కాపాడుతున్నామంటూ పైకి చెప్తూ, ప్రజల హక్కులను కాలరాయడం దుర్మార్గం.

మరోవైపు హైకోర్ట్ ఎన్నిసార్లు చెప్పినా హైడ్రా తీరు మారలేదు. మందలించడం, మొట్టికాయలు వేయడం, అరెస్ట్‌కు ఆదేశాలు ఇవ్వడం, మిలిటరీ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించినప్పుడైనా హైడ్రా మారిందా అంటే, ఏ మాత్రం లెక్కలేనితనంతోనే వ్యవహరించింది. కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ 'అంతా మా ఇష్టం.. పాలకులు చెప్పినట్టు తలూపుతాం' అన్నట్టుగా వ్యవహరించే అధికారులకు హైకోర్ట్ తీర్పు చెంపపెట్టులాంటిదని చెప్పాలి.

## తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డా. రాధా మోహన్ మేకల నియామకం

---మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని హామీ

ఉప్పల్, జూలై 27 ( మన మీ వార్త):




తెలంగాణలో మానవ హక్కుల పరిరక్షణ కోసం కార్యకలాపాలు నిర్వహిస్తున్న తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డా. రాధా మోహన్ మేకలను నియమించినట్లు సంస్థ చైర్‌పర్సన్ డా. వ్యాసభట్ శ్రీవాణి చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా హబ్సిగూడ లోని రాష్ట్ర కార్యాలయంలో ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.నియామకం అనంతరం డా. రాధా మోహన్ మేకల మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన చైర్‌పర్సన్ డా. వ్యాసభట్ శ్రీవాణి చౌదరి, తన నియామకానికి కృషి చేసిన తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. సత్యనారాయణ దేవరకొండకు కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని, హక్కులు ఉల్లంఘనకు గురైన బాధితులకు అండగా నిలిచి న్యాయం జరిగేలా నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి సమర్థవంతంగా సేవలందిస్తూ, ఎక్కడైనా మానవ హక్కులు భంగం కలిగితే తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ తరపున గట్టిగా స్పందిస్తామని తెలిపారు. ఈ బాధ్యత తనపై మరింత సామాజిక బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు డా. రాధా మోహన్ మేకలను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నిస్వార్థ సేవలే మెరుగు శ్రీనివాస్ యాదవ్ గెలుపుకు దోహదపడ్డాయి

----అరుంధతి నగర్ బస్తీ అధ్యక్షుడిగా తొమ్మిదో సారి ఎన్నికైన మెరుగు శ్రీనివాస్ యాదవ్

.... శ్రీనివాస్ యాదవ్ ను అభినందించిన జన సమితి నేతలు





హైదరాబాద్, జూలై 27 ( మన మీ వార్త):

బస్తీ ప్రజలకు నిస్వార్థంతో గత 2003 నుంచి అంటే సుమారుగా 23 సంవత్సరాలుగా సేవలందించడమే మరోసారి బస్తీ అధ్యక్షుడిగా మెరుగు శ్రీనివాస్ యాదవ్ ను ఎన్నిక చేయడానికి దోహద పడిందని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం నరసయ్య అభిప్రాయపడ్డారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతి నగర్ బస్తి ఎన్నికలలో తొమ్మిదవ సారి మెరుగు శ్రీనివాస్ యాదవ్ ను అధ్యక్షుడిగా గెలిపించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ మెరుగు శ్రీనివాస్ యాదవ్ ను అభినందించి,సత్కరించారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ ప్రజలతో మమేకమై అనునిత్యం బస్తి వాసులకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తున్న శ్రీనివాస్ యాదవ్ సేవలు మరింత విస్తృత పరిచి డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. తొమ్మిదో సారి ఎన్నికైన మెరుగు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అరుంధతి నగర్ లో ఘోరావూరిగా జరిగిన ఈ ఎన్నికలలో తనకు మద్దతు పలికిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి నగర ఉపాధ్యక్షులు పునిరెడ్డి జైపాల్ రెడ్డి ఎం లక్ష్మణ్ , కోశాధికారి సురేష్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్ యాదవ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు అజయ్ గౌడ్,బస్తీ వాసులు మీసాల శేషగిరి,సిహెచ్ రాజు, మేకల దాసు, గడ్డం ప్రభాకర్, సత్యనారాయణ, సంపత్,కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## "సర్" ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి..కాంగ్రెస్ శ్రేణులకు మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపు



ఉప్పల్, జూలై 27 (మన మీ వార్త):

సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ సత్య నగర వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి సోమవారం పరిశీలించారు.నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి,తుమ్మల దేవిరెడ్డి,కాటేపల్లి విజయ్ కుమార్, కుశంగళ సతీష్ ముదిరాజ్,ఈగ రాజేష్,పోగుల నర్సింహారెడ్డి,రామోజు సత్యనారాయణ,పోగుల సజీవ రెడ్డి, బొర్ర రాజు, సుప్రీత్,వెంకటేష్ సెట్,నోముల సురేష్,బోడిగే మల్లేష్,కోమటిరెడ్డి వెంకటరెడ్డి,కుయ్యాలా శ్రీనివాస్ మరియు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా పుప్పాల వెంకటేశ్వర్లు నియామకం

-- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందిన పుప్పాల వెంకటేశ్వర్లు

చిలుకానగర్, జూలై 27 ( మన మీ వార్త):





మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పుప్పాల వెంకటేశ్వర్లు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా పుప్పాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు.మల్కాజిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేంద్ర , బిజెపి తెలంగాణ అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు , మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్ , నా తోటి సహచార ఓబీసీ మోర్చా కమిటీ మెంబర్స్ కి, ఉప్పల్ నియోజకవర్గం బిజెపి సీనియర్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు పుప్పాల వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు.నన్ను నమ్మి నాకు పార్టీ ఇచ్చినా ఈ బాధ్యతను తూచా తప్పకుండా నిర్వహిస్తానని పార్టీ ఇచ్చిన ఆదేశానుసారం ముందుకు " వెళ్తానని చెప్పారు, ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పలుగుల యాదగిరి, ఆకుల ఆంజనేయులు, అజయ్ గుప్తా, నల్లు పురుషోత్తం రెడ్డి, అశోక్ రెడ్డి, నాగు నరసింహ, పలుగుల వెంకటేష్, బిక్షపతి, శ్రీనివాస్ చారి తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బీరప్ప గడ్డ డివిజన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా (సర్ ) కార్యక్రమాన్ని పరిశీలించిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, జూలై 27 ( మన మీ వార్త):





బీరప్ప గడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా నగర్ లోని సమీపంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -- సర్ ) కార్యక్రమాన్ని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బీఎల్ఓలతో కలిసి ఓటరు నమోదు, సవరణలు, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను సమీక్షించారు. అనంతరం బీరప్ప గడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకిటి అగం రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు.అర్హులైన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. అలాగే ఓటర్లకు అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీరప్ప గడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకిటి అగం రెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బొట్టు రాజేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులూ బజార్ జగన్నాథ్ గౌడ్, సందీప్ భూషణ్, జగదీష్ , మధుసూదన్, సుశీల, గీత, ప్రేమలత, ఈశ్వరి, ఫహీమ్, రాము గౌడ్, తూర్పాటి జంగయ్య, శ్రవణ్, సుబ్బారావు, రమేష్ గౌడ్, సోను గౌడ్, శ్రవంతి, శ్రీలత, టైలర్ సీను, టైలర్ బాలు, సాయిలు, గవ్వల సంతోష్, రాములు గౌడ్, దుర్గా, ఎడ్ల అంజయ్య, శరత్, శంకర్, నరేష్, శ్రీకాంత్ రెడ్డి, కాశీ, వంశీ, బబ్లూ, బన్నీ , బేడా బుడగ జంగాల బస్తి ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో ఎంపల్లి పద్మా రెడ్డి పై కేసు నమోదు..

- దళిత మహిళా జర్నలిస్టును దూషించినందుకు అట్రాసిటీ కేసు నమోదు
- సిసిఎస్ ముసుగులో అవినీతి అక్రమాల దందాలు..?
- అక్రమాలకు కొమ్ము కాస్తున్న పద్మా రెడ్డి పై విచారణ..?
- కల్తీ పన్నీర్ వ్యవహారాన్ని ప్రశ్నించినందుకే దూషణాల దాడి .?
- అక్రమ దందాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు
- పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నిజానిజాలు బయటపెట్టాలని ప్రజల డిమాండ్.

కాప్రా జూలై 27: (వార్తా ప్రతినిధి)





కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దళిత మహిళా జర్నలిస్టును దూషించడం, బెదిరించడం వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో ఎ.పద్మారెడ్డి పై "ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ" చట్టం కింద కేసు నమోదైనదని బాధితులు తెలిపారు. జర్నలిస్టు విధులు నిర్వహిస్తూ కుషాయిగూడ లోని మురళీకృష్ణ పార్లర్ లో కల్తీ పన్నీరు విక్రయాల అంశాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నించగా, ఆమెను లక్ష్యంగా చేసుకొని అత్యంత అసభ్య పదజాలాలతో దుర్భాషలాడటంతో పాటు రిపోర్టర్లను సైతం బెదిరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, అనేక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. కల్తీ పనీర్ విక్రయాలపై ప్రశ్నించిన మహిళా జర్నలిస్టుపై తీవ్ర స్థాయిలో వ్యక్తిగత దూషణలకు దిగడమే కాకుండా, "రిపోర్టర్ల అంతు చూస్తా" "ముక్కు నేలకు రాయిస్తా" "పిచ్చకుంట్ల రిపోర్టర్లు" అంటూ హెచ్చరికలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇదే మొదటిసారి కాదని, గతంలో కూడా ఆయనపై పలు ఆరోపణలు వచ్చినప్పటికీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న బేతి సుభాష్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇలా అధికార పార్టీ నాయకుల పేర్లు వినియోగిస్తూ స్థానికంగా సిసిఎస్(చర్లపల్లి కాలనీల సమైక్య) ని అడ్డుపెట్టుకొని అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ ఏ ఉద్యోగం చేయకుండా కేవలం సెటిల్మెంట్లే జీవనోపాధిగా చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్నారనే చర్చ ప్రజలలో కొనసాగుతోంది. వాస్తవానికి అక్రమాలకు మధ్యవర్తిగా వ్యవహరించడం వసూళ్లే ధ్యేయంగా పెట్టుకొని జీవించడం జరుగుతుందని, అయితే అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపైన బెదిరింపులకు పాల్పడుతూ వాస్తవాలను వెలుగులోకి తీసుకురాకుండా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడేటట్లు చేసిందన్న విమర్శలు ఏ. పద్మా రెడ్డి పై చాలా ఉన్నాయి. ఈ ఘటన జరిగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి వారం రోజులు అయిన ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు నిన్న 25 తేదీ నాడు జర్నలిస్టు సంఘాల ఒత్తిడితో కేసు నమోదు అయ్యింది అంటే ఎమ్మెల్యే బిఎల్ఆర్ ప్రభావం పోలీసు అధికారులపై ఎంత తీవ్రస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు అని జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. కుషాయిగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని షెడ్లు, నిబంధనలకు విరుద్ధంగా బోరింగ్‌లు, ఇతర అక్రమ కార్యకలాపాలకు ఆయన పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాల్లో ప్రజాప్రతినిదుల పేరును ఉపయోగించి వసూళ్లు జరిగాయనే అభియోగాలు కూడా ఉన్నాయి. ఈ విషయం తెలిసి ప్రజాప్రతినిధులు కూడా మౌనంగా ఉండడం వెనుక అంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి. అధికారులు గతంలో జరిగిన విషయాలపై కూడా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఒక మహిళా జర్నలిస్టు తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న సమయంలో ఆమెపై దుర్భాషలు మాట్లాడటం, బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను, పత్రికా స్వేచ్ఛను అవినీతి అక్రమాలు చేసేవాళ్లు అణిచివేసే ప్రయత్నాలను సహించబోమని జర్నలిస్టు సంఘాలు హెచ్చరించాయి. ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకొని చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు జరిగితే వాటిపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం రాజీపడకుండా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. సమాజంలో జరుగుతున్న అనేక అక్రమాలకు రాజకీయ అండ ఉందనే అనుమానాలు తొలగించాలంటే ఆరోపణలపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపి, ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై నమోదైన కేసు దర్యాప్తు పారదర్శకంగా సాగి, బాధితురాలికి న్యాయం జరగడంతో పాటు భవిష్యత్తులో జర్నలిస్టులపై బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడే వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

## జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి



జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ (ఐఔవీ) కమిటీ సమావేశం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 15లోగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఫంక్షనల్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్లు (ఖీుజం) అందించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి నాణ్యతను కాపాడేందుకు క్లోరినేషన్, నీటి ట్యాంకుల శుభ్రత, పైప్‌లైన్ లీకేజీల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే హర్ ఘర్ జల్ ధృవీకరణ, మిగిలిన గృహ తాగునీటి కనెక్షన్ల పూర్తి, రీచార్జ్ నిర్మాణాలు, సోక్‌పిట్ల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్ జెడ్పి సీఈవో రామ్, డిపిఓ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఢిల్లీలో గళమెత్తిన టీడబ్ల్యూజేఎఫ్

## - జంతర్ మంతర్ లో తెలంగాణ జర్నలిస్టుల ధర్నా






**న్యూఢిల్లీ, జూలై 27 (మీవార్త ప్రతినిధి ) :**

దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పై తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో గళమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పాత్రికేయులు పార్లమెంటు సమీపంలోని జంతర్ మంతర్ లో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో పార్లమెంట్" పిలుపునందుకొని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఢిల్లీ తరలివచ్చిన పాత్రికేయులు ధర్నాలో పాల్గొని సమస్యలపై గొంతెత్తారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాయకులు, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు మారూఫ్ రజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులందరి పక్షాన తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో పార్లమెంట్ వద్ద ధర్నా చేయడం అభినందనీయమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని అన్నారు. ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా ఈ ధర్నాలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుడి హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ ధర్నాలో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షుడు లియాఖత్, సభ్యులు మాన్విక మిశ్రా, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, కుడుతాడి బాపురావు, కే. రమాదేవి, జగదీశ్వర్, పద్మనాభ రావు,బుడిగె మల్లేష్ వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ, రిటైర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రక్షణ చట్టం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పునఃసమీక్ష తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు అందజేశారు.


# కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు పదమూడవ రోజుకు చేరుకున్నాయి

**మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**





ఉదయం గం॥ 05-00లకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట తిథిమండల దేవతా యజనంలో భాగంగా కాళీ క్రమాన్ననుసరించి అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని మాత్రా గాను షోడశీ క్రమాన్ననుసరించి జ్ఞానశక్తిని సర్వమంగళ గాను అలంకరించి పూజారాధనలు జరిపారు. దశమహావిద్యలలో అద్యవిద్యయైన కాళీ సపర్యాక్రమంలో త్రయోదశికి అధిదేవత మన్మథుడు. పంచతన్మాత్రల నుండి పంచభూతములు పుట్టినవి. పంచభూతముల యందు అనగా ఆకాశ, వాయు, తేజో, జల, పృథ్వీ యందు వాటి సూక్ష్మాంతరములైన గుణములు వరుసగా శబ్ద, స్పర్శ, రూప, గంధముల రూపమున అమ్మవారు వ్యాపించి యున్నది. అట్టి సమస్త జీవుల సర్వేంద్రియుల యందు ఆధార శక్తియై అమ్మవారు వ్యాపించి యున్నది. అట్టి అమ్మవారి యొక్క ఒక్క విభూతియే ఈ మాత్రా సర్వమంగళా నిత్యా అమ్మవారు భక్తులకు సమస్త మంగళములను, శుభములను ప్రాప్తింపజేస్తుందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. దివి 29-07-2026 బుధవారం రోజున తెల్లవారుజామున గం॥ 03-00ల నుండి నిత్యాహ్నికం నిర్వర్తించబడిన అనంతరం అమ్మవారికి వలువిధములైన శాకములతో శాకంభరీ అలంకారము ప్రారంభమగును. ఇట్టి అలంకారము ఉదయం గం॥ 09-00ల వరకు జరుగును అలంకారము జరుపుచున్న సందర్భములో భక్తులు అమ్మవారిని దర్శించుకొనుట వీలుపడదు. అమ్మవారి అలంకారమునకు సుమారు 6 గంటల వ్యవధి పట్టును అలంకారము జరుపుచున్న సందర్భములో అమ్మవారిని దర్శించుకొనుటకు వీలుకాదు. అలంకారము జరుపబడిన పిమ్మట పూజానంతరం ఉదయం గం॥ 09-00ల నుండి సర్వదర్శనమునకు భక్తులను అనుమతించబడును, భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు విశిష్ట దర్శనం, అతి శీఘ్రదర్శనం. ధర్మ దర్శనం క్యూలైన్లు యధాపూర్వం ఏర్పాటు చేయడమైనది. దివి: 29-07-2026 బుధవారం రోజున ఉదయం గం॥ 09ల తదుపరి మాత్రమే భక్తులకు శ్రీ భద్రకాళీ అమ్మవారి శాకంభరీ విశ్వరూప దర్శనం ప్రారంభమై రాత్రి వరకు ఉండును ఈ సందర్భంగా భక్తుల రాకను పురస్కరించుకొని చేయవలసిన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు మట్వాడ సి.ఐ శ్రీ కరుణాకర్, ఎస్ ఐలు తదితర పోలీసు సిబ్బందితో ఈ రోజు ఈ.ఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు, హరనాథ్ లు పరిశీలించారు తేది: 29-07-2026 బుధవారం రోజున ఉదయం గం॥ 11-00లకు వ్యాస పూజ, మహాపూర్ణాహుతి, బలిప్రదానం, అవబృధంతో శాకంభరీ ఉత్సవ పరిసమాప్తి జరుగుతుంది.



ఈ రోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడర్ సీనియర్ ఐ.ఏ. ఎస్ అధికారి శ్రీమతి సునీత, ఐ.ఏ. ఎస్ దంపతులు సందర్శించారు. ఆలయానికి విచ్చేసి, శ్రీమతి సునీత, xxూా గారికి ఆలయ ఈ.ఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు ఘనస్వాగతం పలికారు. పూజానంతరం ఆలయస్నపన మండపంలో మహదాశీర్వచనం నిర్వహించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్.డి.ఓ. వెంకన్న, టూరిజం అధికారి శివాజీ, తహశీల్దార్ రవీందర్ తదితరులున్నారు. అనంతరం శ్రీనివాస మంగాపురం చిత్రం హీరో గట్టమనేని జైకృష్ణ, దర్శకుడు అజయ్ భూపతి మరియు చిత్రం యూనిట్ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించారు. రామల సునీత కార్యనిర్వహణాధికారి.

# లింగ వివక్షత,లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం గురించి అవగాహన కార్యక్రమాలతో పాటు చట్టం ఉల్లంగించిన వారి పై కఠిన చర్యలు.

**మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

- హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్. ఏ. అప్పయ్య

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం (ౡజడ్రూచీఱ) జిల్లా స్థాయి అడ్వైసరీ కమిటీ సమావేశశీ ఈ రోజు హనుమకొండ కలెక్టర్ రేట్ లోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ రిపోర్ట్ ప్రకారం జిల్లాలో తగ్గుతున్న బాలికల నిష్పత్తి, స్కానింగ్ సెంటర్ ల పర్యవేక్షణ, డెకాయ్ ఆపరేషన్ ల నిర్వహణ గురించి చర్చించి సభ్యుల సలహాలు స్వీకరించడం జరిగింది. లింగ వివక్షత,లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం గురించి అవగాహన కార్యక్రమాలతో పాటు చట్టం ఉల్లంగించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎంహెచ్ఓ తెలియ చేశారు. గతంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న 3 స్కానింగ్ మిషన్ లను సీజ్ చేయడం జరిగిందని ఎక్కడైనా మొబైల్ స్కానింగ్ మిషన్ లు గాని, లింగ నిర్ధారణ చేస్తున్నారని ఖచ్చితమైన సమాచారం ఉంటే 6300030940 కు తెలియ చేయాలన్నారు. ఇటీవల గౌరవ జిల్లా కలెక్టర్ గారి అధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఖచ్చితమైన సమాచారం అందించే వారికి రూ. 50000/- ప్రోత్సహకంగా ఇవ్వడానికి నిర్ణయించడం జరిగిందని ఆయన తెలియ చేశారు. క్షేత్ర స్థాయి లో పని చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు అంగన్వాడి టీచర్ లు



అప్పటికే ఒకరు లేదా ఇద్దరు ఆడ పిల్లలను కలిగి ఉన్న వారికి అవగాహన కలిగించడమే కాకుండా వారి పై ప్రత్యేక దృశ్తి పెట్టాలని నిర్ణయించడం జరిగింది. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్ సి(ఎంటిపి చట్టం )ప్రకారం గుర్తింపు పొందిన ఆసుపత్రులలో ప్రత్యేక పరిస్తితులలో చట్టం నియమాలకు లోబడి గర్భ విచ్చిత్తికి అవకాశం ఉందని, అంతే కానీ పుట్ట బోయే బిడ్డ ఆడ పిల్ల అని తెలుసుకొని అబార్షన్ కు పాల్పడటం శిక్షార్హం అని మరి ముఖ్యంగా నాటు పద్దతులు, స్వంత వైద్యశీ, అర్హత లేని వైద్యుల వద్ద కు వెళ్ళడం ద్వారా ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని వైద్యులు సూచించారు.

ఈ సమావేశంలో జిఎంహెచ్ గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి, పరకాల జఎజ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ కృష్ణ, మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత, గైనకాలజిస్ట్ డాక్టర్ కవిత, డాక్టర్ రూబీన, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో శ్రీమతి తాళ్లూరి లత, డాన్ బోస్కోస్వచ్ఛంధ సంస్థ ఈ.రాజు, పి. శారద, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, హెల్త్ సూపర్ వైసర్ పద్మజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖధికారి.

## పట్టువదలని జ్ఞానేశ్వరి.. వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతంతో మురిసిందిలా..!

కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్ వెయిట్‌లిఫ్టర్లు పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పటికే మీరాబాయి చాను, రిషికాంత సింగ్, రాజా ముత్తుపాండీలు మెడల్స్ సాధించగా.. జ్ఞానేశ్వరీ యాదవ్ దేశానికి వెండి పతకం అందించింది. 53 కిలోల విభాగంలో జ్ఞానేశ్వరి ఈ మెడల్ సాధించింది. సోమవారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో నైజీరియా లిఫ్టర్‌కు దాదాపు సరిసమానంగా బరువులెత్తిన ఆమె రెండో స్థానంతో సరిపెట్టుకుంది. గ్లాస్గోలో భారత వెయిట్‌లిఫ్టర్లు అద్భుత ప్రదర్శనతో పతకాలు కొల్లగొడుతున్నారు. ఇప్పటికే ఈ విభాగంలో మూడు మెడల్స్ రాగా.. సోమవారం జ్ఞానేశ్వరీ యాదవ్ వెండి వెలుగులు విరజిమ్మింది. 53 కిలోల కేటగిరీలో పోటీపడిన తను.. తొలి ప్రయత్నంలో జ్ఞానేశ్వరి యాదవ్ 82 కిలోలు ఎత్తింది. మూడో ప్రయత్నంలో 85, మూడోసారి 88 కిలోలతో రికార్డు నెలకొల్పింది. అయితే.. కాసేపటికే నైజీరియా లిఫ్టర్ ఒనొమె ఒమొలోలా దిదిహ్ ఏకంగా 90 కిలోలు ఎత్తి ఆధిక్యంలో నిలిచింది. స్నాచ్ విభాగంలో రెండో స్థానంలో నిలిచిన భారత లిఫ్టర్.. పసిడికి గట్టిపోటీనిచ్చింది.

# రామంతాపూర్ శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఘటం ఊరేగింపులో పాల్గొన్నా ఆకారపు అరుణ్ పటేల్





**రామంతాపూర్, జూలై 27 ( మన మీ వార్త):**

ఆషాఢ మాసం బోనాల జాతర మహోత్సవాల సందర్భంగా రామంతాపూర్ గ్రామ సభ్యుల ఆధ్వర్యంలో టీవీ స్టూడియో శ్రీ నల్ల పోచమ్మ గుడి నుండి వైభవంగా నిర్వహించిన ఘటం ఊరేగింపు కార్యక్రమంలో యువ నాయకుడు ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అరుణ్ పటేల్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని, అమ్మవారి దీవెనలు ఎల్లప్పుడూ మనపై ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘటం ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించారు.

# ఎట్టకేలకు ప్రారంభమైన భవానీనగర్ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు



**నాచారం, జూలై 27 ( మనం మీ వార్త):**

నాచారం భవానీనగర్ కాలనీలో ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభమయ్యాయి. నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమస్యను స్థానికులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ టెండర్‌ను రద్దు చేయించి, షార్ట్ టెండర్ ప్రక్రియ ద్వారా కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభమైంది. రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, విఠల్ యాదవ్, సురేందర్, ఆనంద్, వేణు, సుగుణాకర్ రావు, శ్రీనివాస్, యూసుఫ్, రాంచందర్, జహీర్ భాయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించండి: : బల్దియా అదనపు కమిషనర్ జోనా

స్థానికుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కమిషనర్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు...

వివిధ విభాగాలకు చెందిన 104 ఫిర్యాదుల స్వీకరణ....

**మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



గ్రీవెన్స్ దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని జీ డబ్ల్యు ఎం సి ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అదనపు కమిషనర్ తో పాటు వివిధ విభాగాలకు చెంది ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను స్వీకరించి వాటిని ఆయా విభాగాల కు చెందిన అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా :

1. టౌన్ ప్లానింగ్.....36
2. ఇంజనీరింగ్........37
3. రెవిన్యూ.......08
4. హెల్త్ డ శానిటేషన్.10
5. నీటి సరఫరా.....13

మొత్తం = 104

ఈ కార్యక్రమంలో ఎస్ ఈ రాజ్ కుమార్ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఇంచార్జి సి పి రవీందర్ రాడేకర్ డి ఎఫ్ ఓ శంకర్ లింగం డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి సమ్మయ్య సెక్రటరీ అనిల్ బాబు హెచ్ ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్. ఎస్. కె.(క్షత్రియ) సేవా సమాజ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొండా సురేఖ





మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు ఆదివారం వరంగల్‌లోని ఎస్.ఎస్.కె. (క్షత్రియ) సేవా సమాజ్‌లో నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజ సేవకు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. క్షత్రియ సేవా సమాజ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి ప్రజలకు సేవలందిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను సన్మానించి, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని మంత్రి కొండా సురేఖ గారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, సమాజ సభ్యులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 15వ వార్డు కౌన్సిలర్

- కుక్కల విజయ్ కుమార్ హృదయపూర్వక
- జన్మదిన శుభాకాంక్షలు. భారతీయ జనతా పార్టీ



పరకాల ప్రతినిధి మన మీ వార్త

పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణ శాఖ కార్యాలయంలో కుక్కల విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతి లాల్, 12వ వార్డు కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, రాష్ట్ర నాయకులు కాచం గురు ప్రసాద్, చందుపట్ల రాజేందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, నాయకులు మార్త బిక్షపతి, కానుగుల గోపీనాథ్, మెంతుల సురేష్, ముత్యాల దేవేందర్, ఆకుల రాంబాబు, వెల్దండి హేమంత్ తదితరులు, పార్టీ కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వర్షాభావం నేపథ్యంలో కాసిపేటలో విత్తన మేళా ప్రారంభం

కాసిపేట, జూలై 27: (మన మీ వార్త మండల ప్రతినిధి)



వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో కాసిపేట మండలంలోని ముత్యంపల్లి రైతు వేదికలో సోమవారం విత్తన మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు కంది, పెసర, వివిధ కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ అందుబాటులో ఉంచారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకుని, అవసరమైన విత్తనాలను ఈ మేళా ద్వారా పొందాలని రైతులకు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్యంపల్లి సర్పంచ్ చాహకటి సుగుణ, ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, పీఏసీఎస్ చైర్మన్ తాటిపాముల శంకర్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్, ఉప సర్పంచ్ మల్లెతుల సందీప్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఊతూరి సత్తయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారి సాగర్, రైతులు పాల్గొన్నారు.

## విజయ్ బాటలో ధనుష్...

**చెన్నై** : తమిళ చిత్రసీమలో స్టార్ హీరోల రాజకీయ అరంగేట్రం కొత్తేమీ కాదు. ఓఎంజీ, జయలలిత కాలం నుంచి నేటి విజయ్ వరకు ఎంతోమంది కోలీవుడ్ స్టార్స్ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి సంచలనం సృష్టించారు. ఇప్పుడు ఇదే బాటలో ధనుష్ కూడా అడుగులు వేస్తున్నారా? అంటే అవుననే సంకేతాలే కనిపిస్తున్నాయి.తాజాగా తన అభిమానులు నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ధనుష్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తమిళనాడు పొలిటికల్ సర్కిల్స్‌లో కాకరేపుతున్నాయి. తన ఫ్యాన్ బేస్‌ను ప్రత్యక్ష రాజకీయాల వైపు మళ్లించేందుకే ఆయన ఈ ప్లాన్ వేస్తున్నారనే చర్చ మొదలైంది.అభిమానులను ఉద్దేశించి ధనుష్ మాట్లాడుతూ.. ఇంతమంది ఒకే చోట కలవడం చిన్న విషయం కాదు. మీ ఐక్యతలో ఎంతో శక్తి ఉంది. ఆ శక్తిని కేవలం సినిమా వేడుకలకు, ఆడియో లాంచ్‌లకే పరిమితం చేయకండి. ఆ బలాన్ని ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించండి.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలి..జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణి కి మొత్తం 189 దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 49, డీఆర్డీవో 12, హౌసింగ్ శాఖకు 68 రాగా
ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు 60 వచ్చాయని, వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖలు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెవెన్యూ హౌసింగ్ ,పెన్షన్ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని అట్టి దరఖాస్తులను పరిశీలనార్థం సంబంధిత శాఖలకు ఎండార్ఫ్ చేస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డిఆర్డిఓ నాగ పద్మజ, డి ఎం ఎం హెచ్ ఓ డా.ప్రకాష్ మరియు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వినతులు సమర్పించారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

- మృతుడి కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం
- ముగ్గురు చిన్నారులకు ఉచిత విద్య అందించేలా చర్యలు
- ఆపదలో అండగా నిలిచిన 23వ వార్డు కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్
- ప్రజాసేవకు నిదర్శనంగా నిలిచిన మానవతా కార్యక్రమం

వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 27 మీ వార్త



సమాజంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం నిజమైన ప్రజాసేవ అని మరోసారి నిరూపించారు 23వ వార్డు కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చీర్ల శ్యామ్ సాగర్ (స్వామీ) కుటుంబాన్ని పరామర్శించిన ఆయన, వారి కష్టాన్ని పంచుకుంటూ రూ.30,000 ఆర్థిక సహాయం అందజేశారు.అంతటితో ఆగకుండా, శ్యామ్ సాగర్‌కు చెందిన ముగ్గురు పిల్లల భవిష్యత్తు దృష్ట్యా లిటిల్ సోల్జర్స్ స్కూల్ యాజమాన్యంతో ప్రత్యేకంగా చర్చించి వారి విద్యను ఉచితంగా కొనసాగించేలా ఏర్పాట్లు చేయించారు. దీంతో ఆ కుటుంబానికి విద్యాపరంగా ఎలాంటి భారం లేకుండా కీలక భరోసా కల్పించారు.ఈ సందర్భంగా శ్రీకర్ గౌడ్ మాట్లాడుతూ...ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నారుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శశి అన్న, రాము తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు...

# డ్రా ద్వారా బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ (డేూరా) ప్రవేశాలకు సంబంధించి విద్యార్థుల ఎంపిక ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో డ్రా విధానం ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా డ్రా నిర్వహించి అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.
కలెక్టర్ వివరాల ప్రకారం, 5వ తరగతిలో మొత్తం 62 సీట్లు అందుబాటులో ఉండగా, మొదటి విడతలో 52 దరఖాస్తులు మాత్రమే అందాయి. దీంతో మిగిలిన 10 సీట్ల భర్తీ కోసం రెండో విడతలో 17 దరఖాస్తులు స్వీకరించారు. 10 సీట్లకు 17 మంది అర్హులు ఉండటంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం డ్రా నిర్వహించి 10 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, మిగిలిన 7 మందిని వెయిటింగ్ లిస్టులో ప్రాధాన్యత క్రమంలో ఉంచారు. డ్రా ద్వారా ఎంపికైన విద్యార్థులు శివాని స్కూల్, నర్సంపేట; ాూమీ స్కూల్, ధర్మారం; వందన స్కూల్, వరంగల్; విద్యోదయ స్కూల్, నెక్కొండ తదితర పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఙూజఙూ (ఖీూజ) పుష్పలత, ఙజూ (Social Welfare) సరిత, అకాడెమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ

- మండల మాజీ అధ్యక్షుడు హమీద్ అధ్యక్షతన మండల నాయకులు

పరకాల ప్రతినిధి మన మీ వార్త



భూపాలపల్లి జయశంకర్ జిల్లా కొత్తపెల్లి గోరి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హమీద్ మాట్లాడుతూ... నిన్నటి రోజున ఉద్యమ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు లోనై గులాబీ క్యాడర్ అంత అయోమయంలో ఉండగా... శాసనమండలి అధ్యక్షుడు సిరికొండ మధుసూదన చారి కుమారుడు కొంతమంది తమ అనుచరులతో పార్టీ సమావేశం అంటూ సమావేశం నిర్వహించి, భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్ పై క్యాడర్ ను అయోమయం గురి చేసే మాటలు మాట్లాడటం విస్మయానికి గురి చేసిందని అన్నారు.
స్వయంగా గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జిగా.. ఎమ్మెల్యే అభ్యర్థిగా గండ్ర వెంకటరమణ రెడ్డి ఉంటారని పలు మార్లు ప్రస్తావించినప్పటికీ కార్యకర్తలను అయోమయం చేసే ప్రయత్నం చేయటం పార్టీ ప్రతిష్ట ను దిగజార్చడమే అన్నారు. నియోజకవర్గం లో కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ఏ కష్టం వచ్చిన అందుబాటులో ఉంటూ అందరినీ హక్కున చేర్చుకునే రమణ రెడ్డి గారికి టికెట్ వస్తుందని, సిరికొండ మధుసుధనా చారి గారికి పెద్దలు కేటీఆర్ చెప్పినట్లు రాష్ట్ర లో పదవిలో ఉంటారని అన్నారు.
ఉనికిని కాపాడుకోవడానికి కొంత మంది అనుచరులను వెంట వేసుకొని, పార్టీ క్యాడర్ కు తప్పుడు సంకేతాలను ఇవ్వడం సమంజసం కాదని, పార్టీ సమావేశం ఏర్పాటు చేస్తే..ఎందుకని మండల, గ్రామ అధ్యక్షలు, యూత్ అధ్యక్షులతో కాకుండా వారి అనుచరులతో సమావేశం ఏర్పాటు చేయటం అధిష్టానాన్ని దిక్కరించడమే అన్నారు
ఏది ఏమైనప్పటికీ గోరి కొత్తపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ క్యాడర్ ఎల్లప్పుడూ రమణ రెడ్డి తోనే ఉంటుందని, రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు.
రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ , భూపాలపల్లి అభివృద్ధి ప్రదాతగా శాసన సభ్యులుగా గండ్ర వెంకటరమణ రెడ్డి కావటం ఖాయమని అన్నారు. గ్రామాలలో ప్రతి కార్యకర్త రమణ రెడ్డి వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, గోరి కొత్తపల్లి సర్పంచ్ నిమ్మల శంకర్, మాజీ టౌన్ అధ్యక్షుడు రఘుసాల తిరుపతి, గండ్ర యువసేన మండల అధ్యక్షుడు సుధనబోయిన సుమన్, బోయినీ తిరుపతి, వార్డు సభ్యులు ఈర్ల పైడి,పసుల రాకేష్, సీనియర్ నాయకులు చిలుక చేరాలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తొలిమెట్టు వృత్యంతర ఉపాధ్యాయ శిక్షణ

జూలై 27 మన మీ వార్త ప్రతినిధి వెల్దుర్తి



2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఈరోజు మండల స్థాయిలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యెల్దుర్తి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మరియు వెల్దుర్తి ఎంఈఓ బుచ్చయ్య నాయక్ మాట్లాడడం జరిగింది . ఈ సంవత్సరం ముఖ్యంగా వినూత్న బోధన కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో ప్రతిరోజు ఒక గంట సేపు నిర్వహించాలని ఎంఈఓ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల రిసోర్స్ పర్సన్స్ గా నవీన్ కుమార్ చంద్రశేఖర్ చిరంజీవి వసంత్ వ్యవహరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో రెండు దశలలో నిర్వహించి పాఠశాలల్లో కార్యక్రమాన్ని అమలు చేసే విధంగా శిక్షణను ఉపాధ్యాయులు పొందుతారు .

# రైతు వేదికలో విత్తనమేళా మరియు జలసిరి పై అవగాహన కార్యక్రమం

పరకాల ప్రతినిధి మన మీ వార్త

హనంకొండ జిల్లా నడికూడ రైతు వేదికలో రైతులకు నాణ్యమైన కంది విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు విత్తనమేళా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ...ప్రస్తుత వాతావరణ పరిస్థితులను మరియు ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు వేసుకోవాలని అందులో కంది పంట చాలా అనుకూలమని తెలిపారు.ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు మరియు వాతావరణంలో ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరమున్న పంటల కంటే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని నడికూడ మండల వ్యవసాయ అధికారి సూచించారు.

ముఖ్యంగా కంది, పెసర, మినుములు, జొన్న, సజ్జ, రాగులు, నువ్వులు వంటి ఆరుతడి పంటలు తక్కువ నీటితో మంచి దిగుబడిని అందించే అవకాశముందని తెలిపారు. వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల విస్తీర్ణాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని పేర్కొన్నారు. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన విత్తే దూరం, సమతుల్య ఎరువుల వినియోగం, కలుపు నివారణ వంటి శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు.



ఈ విత్తనమేళా మరో రెండు రోజులు ఉంటుంది కాబట్టి రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉన్న నాణ్యమైన కంది విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని, అలాగే కూరగాయల విత్తనాలు కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ తెలిపారు.

అదేవిధంగా నడికూడ రైతు వేదికలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫార్మ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, వర్షపు నీటిని ఫార్మ్ పాండ్స్‌లో నిల్వ చేసుకోవడం ద్వారా పంటలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు.ఫార్మ్ పాండ్స్ ద్వారా భూగర్భ జలాల పెరుగుదల, నీటి సంరక్షణ, సాగునీటి అందుబాటు మెరుగుపడి రైతులకు స్థిరమైన దిగుబడులు సాధించడానికి దోహదపడుతుందని వివరించారు. రైతులు తమ వ్యవసాయ భూముల్లో సాధ్యమైనంత మేరకు ఫార్మ్ పాండ్స్ ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, గోపినాథ్, భాస్కర్, రామకృష్ణ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలి

- ఏ ఎం సి చైర్మన్ రాజిరెడ్డి.

పరకాల ప్రతినిధి మన మీ వార్త

పరకాల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విత్తన మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎంసి చైర్మన్ రాజిరెడ్డి హాజరై రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏ ఎం సి చైర్మన్ రాజిరెడ్డి రైతులతో మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు, పంట నష్టాలను కూడా తగ్గించుకోవచ్చని



తెలిపారు. విత్తన మేళాలో ఏవో శ్రీనివాస్ సర్, ఏ ఈ ఓ ఎస్ , ఎం శరత్ కాటంరాజు , ఎండి రాజా ,విత్తన డీలర్లు, రైతులు చురుకుగా పాల్గొన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల నాణ్యమైన విత్తనాల గురించి అధికారులు మరియు డీలర్లు వివరించారు. రైతులు తమకు అనుకూలమైన పంటలు, విత్తనాలపై సమాచారం తెలుసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవగాహన కల్పించడం విత్తన మేళా ప్రధాన ఉద్దేశ్యమని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

జూలై 27 నుండి 29 వరకు రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాలను రైతు సోదరులందరూ సందర్శించి, నాణ్యమైన విత్తనాలను పొందడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని కోరారు.

# రాజకీయ కుట్రతో దేవేందర్ నగర్ లో అఖిలపక్షం సమావేశం

- బెల్ట్ షాపుల పై నోరు మెదపని అఖిలపక్షం రాజకీయ నాయకులు
- ఆ వృద్ధుడు గృహప్రవేశం ఇంటి యజమానిని తిట్టిన సిసి ఫొటోస్ ఎందుకు బయటకు పెట్టడం లేదు
- ప్రతి రాజకీయ నాయకునికి తెలుసు గొడవ ఎందుకు వచ్చింది...? ఆ సమస్య ఎత్తడం లేదు...
- తప్పుడు ఆరోపణలతో బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదు - జెన్న రాజు

బోడుప్పల్, జులై 27(మన మీ వార్త)

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ లోని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జెన్న రాజు, సోమవారం రోజున పత్రిక సమావేశంలో మాట్లాడుతూ...కొంతమంది రాజకీయ నాయకులు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ గత నెల కింద గొడవ జరిగిందని దానికి నాకు సంబంధం ఉందని నోటికొచ్చినట్లు, మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు మాట్లాడుతున్నారు. నాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పోలీసుల పై ఒత్తిడి చేసి కుట్రతో నాపై కేసు నమోదు చేయించినారు. ఆదివారం రోజున దేవేందర్ నగర్ కాలనీ లో అఖిలపక్షం పేరుతో సమావేశం ఏర్పాటు చేసి వివిధ పార్టీల నాయకులను పిలిపించి, నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ప్రతి ఒక్కరిపై త్వరలో పరువు నష్టం, కేసు నమోదు వేస్తా అని అన్నారు. నేను మా తమ్ముడు గొడవలో లేను అని గత నెల క్రిందనే పత్రిక సమావేశంలో తెలపడం జరిగింది. అయినా కొంతమంది బోడుప్పల్ రాజకీయ నాయకులు కుట్రతో, నా ఎదుగుదలను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గొడవ జరగడానికి కారణం ఒక 65 సంవత్సరాలు వృద్ధుడు యాకయ్య, గృహప్రవేశం ఇంటి యజమానితో గొడవ ఎందుకు వచ్చిందో ఒక్క రాజకీయ నాయకుడు ఇప్పటివరకు నిజాయితీగా చెప్పలేదు. ఆ వృద్ధుడిపై దాడి జరిగిన సంఘటన కొంతమంది మహిళలు మీడియా ద్వారా కూడా ప్రకటించినారు. ఆ వృద్ధుడు గృహప్రవేశం ఇంటి యజమానిని తిట్టిన సిసి ఫొటోస్ ఎందుకు బయటకు పెట్టడం లేదు. వృద్ధుడిపై దాడి జరిగిన సిసి ఫొటోస్ వీడియోలు, ఎందుకు బయట పెట్టకుండా బెల్ట్ షాప్ యజమాని విష్ణు గౌడ్, రాజకీయం చేస్తూ, తప్పుడు ఆరోపణలు సృష్టించి, నిజం బయటపడితే బెల్ట్ షాప్ పై కేసు నమోదు అవుతుంది. దేవేందర్ నగర్ లో అఖిలపక్షం పేరుతో సమావేశం ఏర్పాటు చేసి ఇక్కడికి వచ్చిన రాజకీయ నాయకులు గతంలో దాడులు చేయలేదా, వాటి యొక్క వివరాలు నా దగ్గర ఉన్నాయి, కబ్జాలు చేసి అమ్ముకున్న పత్రాలు కూడా ఉన్నాయి, ఇక్కడికి వచ్చి పేద ప్రజల ముందు ఏమి ఎరగనట్టు నిజాయితీగా ఉన్నట్టు, వారిపై ఎలాంటి కేసులు లేనట్లు, నోటికొచ్చినట్లు మాట్లాడుతే... బెదిరిస్తే భయపడే ప్రసక్తేలేదని , త్వరలో మీ బండారమంతా మీ



అవినీతి అంతా బయట పెట్టి తేల్చుకుంటా, అని అన్నారు. అఖిలపక్షం సమావేశంలో దేవేందర్ నగర్ కాలనీ లోని నివసించే ప్రజలు లేరు. ఒక పదిమంది, తప్ప , బోడుప్పల్ లోని మిగతా కాలనీ వాళ్ళంతా రావడం జరిగింది. ఇక్కడ గల్లీకో బెల్ట్ షాపు ఉన్న సంగతి ప్రతి రాజకీయ నాయకునికి తెలుసు గొడవ ఎందుకు వచ్చింది...? ఆ సమస్య ఎత్తడం లేదు. విష్ణు గౌడ్, రిపోర్టర్ కాదు ఒక బెల్ట్ షాపు నడుపుకునే యజమాని, ఆ విషయం ప్రతి రాజకీయ నాయకునికి తెలిసిన అయినా, నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఎందుకంటే ఇక్కడ కొంతమందికి గతంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తో కొనుక్కున్నవారు. వారి యొక్క స్థలాలను, బోడుప్పల్ కు సంబంధించిన కొంతమంది రాజకీయ నాయకులు వాటిని తప్పుడు సంతకాలతో నోటరీ ద్వారా మళ్లీ అమ్ముకొని సొమ్ము చేస్తూంటారు. గతంలో కొనుక్కున్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ యజమానులు, నా దగ్గరికి వచ్చి ఇండ్లు కట్టియమని అడుగుతే వారి యొక్క స్థలంలో ఇండ్లు నిర్మించడం జరిగింది. బోడుప్పల్ రాజకీయ నాయకులు వాళ్లు చేసిన నోటరీ కొనుక్కున్నవారు. స్థలం దగ్గరికి రానివ్వకుండా వెళ్లగొట్టడంతో, ఈ బోడుప్పల్ రాజకీయ నాయకులు కొంతమంది, నాపై కక్ష కట్టి నా రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ఈ ఆరోపణలు చేస్తున్నారు. త్వరలో ఆధారాలతో వీరి బండారం బయటపెడతా అని తెలిపినారు.

## పరారీలో ఉదయ్ కృష్ణారెడ్డి...

**హైదరాబాద్ :** అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా సర్వీస్‌కు ఎంపికై, దేశానికి రక్షణగా నిలవాల్సిన ఒక ట్రైనీ ఐపీఎస్ అధికారి వరుస తప్పిదాలతో తన భవిష్యత్తును తానే స్వయంగా ప్రమాదంలో పడేసుకుంటున్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ లో శిక్షణ పొందుతున్న సమయంలో చోటుచేసుకున్న వివాదం నుంచి ఇప్పటివరకు ట్రైనీ ఐపీఎస్ అధికారి ఎం. ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. లీగల్ అడ్వైజ్ తీసుకుని బాధ్యతాయుతంగా చట్టాన్ని ఎదుర్కోవాల్సిన అధికారి.. ముందస్తు ప్రణాళిక లేకుండా తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటూ, విచారణాధికారులకు చిక్కకుండా పరారవడం ఆయన లీగల్ పొజిషన్‌ను మరింత బలహీనం చేస్తోంది.ఈ వివాదానికి మూలం పోలీస్ అకాడమీ శిక్షణ కాలంలోనే పడింది. వివాహిత అయిన తోటి మహిళా ట్రైనీ ఆఫీసర్‌తో సన్నిహిత సంబంధం కొనసాగించడం, ఆ తర్వాత వారి మధ్య తలెత్తిన విభేదాలు పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కే వరకు వెళ్లడం మొదటి తప్పిదమైతే.. దాన్ని సరిదిద్దుకునే అవకాశం ఉన్న దశలో కేసు తీవ్రతను తగ్గించుకోలేకపోవడం రెండో తప్పిదంగా మారింది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో సదరు మహిళా అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు కావడం, అకాడమీ నిబంధనలు మరియు సివిల్ సర్వీసెస్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనల కింద ఇప్పటికే ఆయన సస్పెన్షన్‌కు గురికావడంతో కెరీర్ మొదటికే ఎసరు వచ్చింది.కేసు నమోదైన తర్వాత పరిస్థితిని నైతికంగా, సాంకేతికంగా ఎదుర్కోవాల్సింది పోయి.. ఆత్మహత్యాయత్నం నాటకం ఆడటం, సూసైడ్ నోట్ పేరుతో మరికొందరిపై ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియా, ప్రింట్ మీడియా ముందుకు రావడం ఉదయ్ కృష్ణారెడ్డి చేసిన మరో పెద్ద పొరపాటు. హైదరాబాద్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం పోలీసుల విచారణకు సహకరించకుండా కనిపించకుండా పోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. డిపార్ట్‌మెంట్‌కు, పోలీసులకు ఇచ్చిన రెండు చిరునామాల్లోనూ ఆయన అందుబాటులో లేకపోవడంతో నోటీసులు సైతం అందజేయలేని పరిస్థితి ఏర్పడింది. చట్టాన్ని రక్షించాల్సిన అధికారి స్థానంలో ఉండి, చట్టం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం ఐపీఎస్ అధికారులకు వర్తించే ఆల్ ఇండియా సర్వీసెస్ డిసిప్లిన్ రూల్స్ ప్రకారం తీవ్రమైన నేరం."చట్టం చేతులు చాలా పొడవు.. ఎంత తప్పించుకుంటే అంతగా ఇరుక్కుపోతారు"

## సహకార సంఘాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

- కల్పలత సూపర్ బజార్ సొసైటీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండ నగరంలోని రంగంపేట వద్ద ఉన్న కల్పలత సూపర్ బజార్ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ బజార్‌లో వినియోగదారులకు అందిస్తున్న సేవలు, సరుకుల లభ్యత, నిర్వహణ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ పనితీరును తనిఖీ చేసి, ఇంధన విక్రయాలు, నిర్వహణ, సిబ్బంది విధులు, రోజువారీ లావాదేవీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సూపర్ బజార్‌లోని టెక్స్‌టైల్స్ విభాగాన్ని పరిశీలించి, ముఖ్యంగా చేనేత వస్త్రాలు, చేనేత చీరలు తదితర ఉత్పత్తుల నాణ్యత, విక్రయాలు, నిల్వల వివరాలను తెలుసుకున్నారు. చేనేత ఉత్పత్తులకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ సజావుగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సహకార సంఘ సభ్యుల సంఖ్య, సంఘ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

ఈ తనిఖీలో జిల్లా సహకార అధికారి బి. మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంధ్యారాణి, ఆడిట్ అధికారి కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

## హస్తం పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తా

- లక్ష మెజార్టీతో ప్రేమ్ సాగర్ రావు విజయం లక్ష్యం: సుధమల్ల హరికృష్ణ

మంచిర్యాల, జులై 27( మన మీ వార్త )

కాంగ్రెస్ పార్టీని మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో మరింత బలోపేతం చేసి, యువతను పెద్దఎత్తున పార్టీలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని నూతనంగా నియమితులైన కాంగ్రెస్ కార్పొరేషన్ అధికార ప్రతినిధి సుధాముల్ల హరికృష్ణ స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును లక్ష మెజార్టీతో గెలిపించడం కాంగ్రెస్ శ్రేణుల ప్రధాన లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగుతూ కాంగ్రెస్ విజయమే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తామని హరికృష్ణ తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి ఎస్సీ నేతగా కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షురాలు సురేఖకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ మధుకర్, పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ తో కలిసి కాంగ్రెస్ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తతో కలిసి పనిచేస్తామని హరికృష్ణ స్పష్టం చేశారు.



కార్పొరేషన్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా సుధమల్ల హరికృష్ణ

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ

## ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పరామర్శించారు.

మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. కేసీఆర్ అంతకుముందు ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రం నుంచి సికింద్రాబాద్ వచ్చారు. నేరుగా ఆస్పత్రికి వెళ్లి సుదర్శన్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నేతలు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పల్లా రాజేశ్వర్, సంజయ్ కుమార్, సంతోష్ కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బాల్క సుమన్ తదితరులు ఉన్నారు. కేసీఆర్ రాకతో ఆస్పత్రికి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురైన సుదర్శన్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం హనుమకొండ నుంచి సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. వెంటిలేటర్పై ఉంచి ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్టు తెలిసింది.



యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డిని చూసిన అనంతరం ఆయన సతీమణి సప్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన టిఆర్ఎస్ అధినేత కేసీఆర్ టిఆర్ఎస్ నాయకులు

## తాటిగూడలో ప్రత్యేక మహిళా గ్రామసభ




**కాసిపేట, జూలై 27: (మన మీ వార్త మండల ప్రతినిధి)**

కాసిపేట మండలంలోని తాటిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక మహిళా గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహిళా సాధికారత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, దోమల నివారణ చర్యలు, గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు.మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడంతో పాటు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ సూచించారు. ఘన, తడి, పునర్వినియోగ, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి పంచాయతీకి అందించాలని 4-వే సెగ్రిగేషన్ విధానాన్ని వివరించారు.గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా మోటార్లు, చేతి పంపులను వెంటనే మరమ్మతు చేయాలని నిర్ణయించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీల శుభ్రత, నిల్వ నీటి తొలగింపు, ఫాగింగ్, పిచికారీ చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళలు ప్రస్తావించిన స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తమ్మినేడి విజయలక్ష్మి శ్యామ్ శేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, వార్డు సభ్యులు మడావి దేవు, గుండవెని శేఖర్, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్తులు రొడ్డ పద్మ, సిడం గాయత్రి, మడావి రాజేష్, వెలాది అర్జున్, మడావి గోపాల్, రొడ్డ కృష్ణ, గడ్డం రామస్వామి, మడావి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కేపల్లి లో గిరిజన రైతులకు ఉచిత దేశీయ కూరగాయల విత్తనాల పంపిణీ



**కాసిపేట, జూలై 27: (మన మీ వార్త మండల ప్రతినిధి)**

కాసిపేట మండలంలోని మల్కేపల్లి గిరిజన గ్రామంలో సీఎస్ఏ, నాబార్డ్, బెల్లంపల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీసీ) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గిరిజన రైతు కుటుంబాలకు ఉచితంగా దేశీయ కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు.స్థానిక సర్పంచ్ కోట్నాక రఘుపతి కార్యక్రమాన్ని ప్రారంభించి, 17 రకాల దేశీయ కూరగాయల విత్తనాలతో కూడిన ప్యాకెట్లను గిరిజన రైతు కుటుంబాలకు అందజేశారు. ప్రతి ఇంట్లో పోషకాహార అవసరాలు తీర్చడంతో పాటు దేశీయ వంగడాల పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంజిరాల సందీప్, వార్డు సభ్యులు, బెల్లంపల్లి ఎఫ్‌పీసీ చైర్మన్ వెంబడి కిషన్, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి పనులపై అధికారులకు శిక్షణ

**కాసిపేట, జూలై 27: (మన మీ వార్త మండల ప్రతినిధి)**



కాసిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గ్రామాభివృద్ధి పనుల అమలు, ప్రణాళిక, నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించిన ఈ శిక్షణలో అధికారులు, సిబ్బంది పాల్గొని పలు అంశాలపై అవగాహన పొందారు. గ్రామీణ ఉపాధి, జీవనోపాధి హామీ చట్టం--2025 అమలు, జల సంరక్షణ పనులు, వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ గుంతల ఏర్పాటు, వర్షపు నీటి ఇంకుడు గుంతలు, నీటి నిల్వ చెరువులు, బోరు బావుల పునర్భర్తీ నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులు, వాటి అమలు విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ, అదనపు కార్యక్రమాల అధికారి నవీన్ కుమార్, సీనియర్ సహాయకుడు అకుల లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ సమన్వయకర్త మల్లేశ్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## బీమా అమలు చేయాలని బ్యాంక్ ఎదుట సింగరేణి రిటైర్డ్ కార్మికుల ధర్నా



తాండూర్ : మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. యూనియన్ బ్యాంకులో ఖాతాలు కలిగి ఉన్న కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 2024 ఒప్పందం ప్రకారం 70 ఏళ్లలోపు పెన్షనర్లకు రూ. 30లక్షల ప్రమాద బీమా. రూ. 10లక్షల సహజ మరణ బీమా కల్పించడంలో బ్యాంక్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా యూనియన్ బ్యాంక్ యజమాన్యం సింగరేణి రిటైర్డ్ బొగ్గు పెన్షన్ దారులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం, పది రోజుల్లోగా తమకు బీమా సౌకర్యం కల్పించకపోతే జిల్లా వ్యాప్తంగా కుటుంబాలతో సహా శాంతియుతంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి

**- ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి.**

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**మన మీ వార్త జులై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**





ప్రజావాణిలో వివిధ సమస్యలపై 264 అర్జీలు స్వీకరణ

హనుమకొండ: జులై 27. హనుమకొండ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీ ఇప్పటికే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయబడిందని, సంబంధిత శాఖల అధికారులు వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉండకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అదేవిధంగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన పెండింగ్ లో ఉన్న వినతులను కూడా ప్రాధాన్యంగా తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఎల్‌నీనో ప్రభావంతో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జలసిరి కార్యక్రమం కింద పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి సంరక్షణ ప్రాధాన్యతపై గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

మండల ప్రత్యేక అధికారులు, స్థానిక సర్పంచులు, రైతులు, గ్రామస్థులతో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో వరి, పత్తి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా కందులు, పెసర, మినుములు, ఇతర ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల ఎంపిక చేసుకునేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ పరిపాలన, గృహనిర్మాణం, వైద్య ఆరోగ్యం, ఉపాధి, విద్య, విద్యుత్, కార్మిక, భూగర్భ జల వనరులు, రెవెన్యూ, సంక్షేమ శాఖలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 264 అర్జీలు ప్రజలు సమర్పించారు.

ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించి, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీపై నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టి, అర్జీదారులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీఓ మీన శ్రీను, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా,భవిష్యత్తు తరాల మనుగడ కోసం పంట మార్పిడి విధానం తప్పనిసరి.



**- ప్రాజెక్టు వైవిధ్యం అమలు, ఎమ్మెల్యే తో కలిసి ప్రారంభించిన :: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**

**మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**







సోమవారం మహబూబాబాద్ పట్టణం ఏటిగడ్డ తండ రైతు వేదికలో విత్తనమేళ ప్రారంభించిన సందర్భంగా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ తో కలిసి జిల్లాలో ప్రాజెక్టు వైవిధ్యం కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ కంపెనీల ప్రతినిధులు ఏర్పాటు చేసిన విత్తనాల స్టాల్స్ ను సందర్శించారు, రైతులతో స్వయంగా మాట్లాడి ప్రత్యామ్నాయ ప్రణాళికకు అనుగుణంగా విత్తనాలను (సీడ్స్) ను పంపిణీ చేశారు,

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ సూపర్ ఎల్ నినో ప్రభావం వలన ప్రస్తుత వర్షాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఎస్సారెస్పీ, ఇతర నీటి వనరులు కూడా అందుబాటులో లేనందున రైతులు కొంత ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతుందని, ఇట్టి విషయాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ పంట మార్పిడి వైపు అడుగులు వేసి ఆరుతడి పంటలు, కూరగాయల పంటలు సాగు చేస్తే రైతులకు అధిక దిగుబడి లాభాలు కూడా వస్తాయని కోరారు, ప్రతి రైతు తనకు ఉన్న భూమిలో సాధ్యమైనంత వరకు నీటి కుంట (పంట కుంట)ను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నీటి వనరులు అందుబాటులో ఉంటాయని సూచించారు, తాను కూడా తన వ్యవసాయ క్షేత్రంలో పంట కుంట ఏర్పాటు చేసి కూరగాయలు, ఆకుకూరల పంటలను పండిస్తానని, కేవలం సేంద్రీయ ఎరువులతో తన కుటుంబానికి సరిపోయే మాత్రమే వరి వేసుకుంటానని తెలిపారు, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ సేంద్రియ ఎరువులు పంట మార్పిడి విధానం తదితర వ్యవసాయం కు సంబంధించిన అన్ని అంశాలను తెలియపరచడం జరుగుతుందని ప్రతి ఒక రైతు ప్రభుత్వం సూచించిన పంటలను వేసుకుని అధిక లాభాలు పొందాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ప్రస్తుత సూపర్ ఎల్ నినో వాతావరణ నేపథ్యంలో జిల్లాలో ఆరుతడి పంటలు, కూరగాయల పంటల ప్రోత్సాహం, తక్కువ నీటితో ఎక్కువ సాగు రైతులకు సుస్థిర వ్యవసాయం ఆహార భద్రత, వరి, పత్తి, మిరప, మక్క జొన్న పంటలు కాకుండా తక్కువ నీటి ద్వారా పండే ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేయాలని అందుకోసం జిల్లాలో ప్రాజెక్ట్ వైవిధ్యం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లాలో పంట మార్పిడి విధానం ద్వారా వ్యవసాయ, ఉద్యాన,పట్టు పరిశ్రమల శాఖల ద్వారా గ్రామ గ్రామాన విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి మండల స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్టికల్చర్ అధికారులు రైతు వేదికలలో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రస్తుతం వేయవలసిన పంటల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతు ప్రభుత్వం సూచించిన ప్రకారం వ్యవసాయ శాఖ అధికారుల నుండి సమాచారం సేకరించి కూరగాయలు,ఆకుకూరలు, ఆరుతడి పంటలు,సాగు చేయాలని కోరారు. అధికంగా వరి పండించడం వలన, అధిక యూరియా వాడకం, కాన్సర్ రావడం, భూసారం కోల్పోవడం, అవసరం కంటే ఎక్కువ మిల్లుల ఏర్పాటు, బీహార్, చత్తీస్గడ్ నుండి హమాలీలను రప్పించుకోవాల్సిన అవసరాలు, రవాణా, నిలువ చేసే గోడౌన్ ల విషయాలలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. పసుపు, వేరు శనగ విస్తీర్ణం తగ్గడం వలన పరిశ్రమలు మూత పడి చాలా మంది ఉపాధి కొల్పయారని తెలిపారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలైన అపరాలు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్లు, పూలు, మల్బరీ, మునగ, ఉల్లి వంటి పంటలు సాగు చేయడం వలన రైతుకు ఆదాయం తో పాటు పలు పరిశ్రమలు ఏర్పాటు జరిగి ఎంతో మంది ఉపాధి కలిగే అవకాశం ఉందని రైతులకు తెలిపారు. ప్రతి రైతు మనస్ఫూర్తిగా పంట మార్పిడి విధానం వైపు మొగ్గు చూపాలని భవిష్యత్తు తరాల మనుగడ ఆరోగ్యం కోసం ఇతర పంటలు పెసర్లు, వేరుశనగ, కూరగాయలు, చిరుధాన్యాలు, తదితర పంటల సాగును స్ఫూర్తితో కొనసాగించాలని సూచించారు. విబిజి రామ్ జి పథకం లో 5 ఎకరాల లోపు ఉన్న రైతులు పంట కుంటలు (నీటి కుంటలు) ఏర్పాటు చేసుకోవాలని అలాగే మునగ తోటల పెంపకం కూడా సదరు పథకం ద్వారా నాటు కోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వరి పండించడం ద్వారా ఎక్కువగా ఉపయోగం లేదని మూడు పూటలా భోజనాలు చేస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు, ప్రతి ఊరిలో అన్ని రకాల పంటలు పండించడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు, జిల్లాలోని సుమారు 2 లక్షల పైచిలుకు రైతులు ఉన్నారని డిమాండ్ కనుగుణంగా వారు కూడా సమిష్టి సమన్వయం (సిండికేట్ అయ్యి) డిమాండు ఉన్న పంటలను పండించి అధిక లాభాలు పొందాలని కోరారు, జిల్లాలో సరిపడా విత్తనాలు సిద్ధం చేయడం జరుగుతుందని కొన్ని విత్తనాల కోసం ప్రభుత్వం సబ్సిడీ విధానం కల్పించడం జరుగుతుందని ప్రతి ఒక రైతు ఈ సబ్సిడీలను వినియోగించుకోవాలని, మార్పు కోసం ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని కలెక్టర్ అన్నారు,

సమాజం ఆరోగ్యంగా ఉండాలి అంటే రైతు బాధ్యతాయుతంగా ఆరోగ్యకరమైన పంటలు పండించాలని ఆమె కోరారు,

అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన రైతులతో ఆరుతడి పంటలు వేయాలని ప్రతిజ్ఞ చేయించారు,

ఈ సమావేశంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, స్థానిక సర్పంచులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ అకాడమీ...



**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం డ్రోన్ అకాడమీ ద్వారా డీజీసీఏ సర్టిఫైడ్ శిక్షణను అందిస్తోంది. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ గుర్తింపు ఉన్న సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. : సినిమాల్లో కనిపించే అద్భుతమైన డ్రోన్ షాట్లు, రాజకీయ ర్యాలీల్లో తీసే ఏరియల్ వీడియోలు చూసి చాలా మంది డ్రోన్ ఎగరేయాలని అనుకుంటుంటారు. అయితే డ్రోన్‌ను ప్రొఫెషనల్‌గా నడపడం ఒక ప్రత్యేక నైపుణ్యం. అలాంటి వారికి తెలంగాణ ప్రభుత్వం డ్రోన్ అకాడమీ ద్వారా డీజీసీఏ సర్టిఫైడ్ శిక్షణను అందిస్తోంది. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ గుర్తింపు ఉన్న సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. అయితే, ఆధాయం విషయానికి వస్తే.. డ్రోన్ పైలెట్ ఆదాయం మీరు ఎంచుకున్న రంగాన్ని బట్టి మారుతుంది. వేలల్లో నుంచి లక్షల్లో కూడా ఆదాయం లభిస్తుంది.డ్రోన్ అంటే కేవలం ఒకే రకం కాదు. వినియోగాన్ని బట్టి అనేక రకాల డ్రోన్లు ఉంటాయి. వాటి పనితీరు, వినియోగం, భద్రతా నియమాలు, ఆపరేషన్ విధానాలపై పూర్తి స్థాయి శిక్షణ ఇస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి సర్టిఫికెట్ అందుతుంది. దేశంలో విమాన పైలెట్లకు కూడా ఇదే సంస్థ గుర్తింపు ఇస్తుండటంతో ఈ సర్టిఫికెట్‌కు మంచి ప్రాధాన్యం ఉంది.తెలంగాణ ప్రభుత్వం దీనికోసం ఒక వెబ్‌సైట్ తీసుకొచ్చింది. ఈ వెబ్ సైట్ లోకి వెళితే మీకు అందులో ఆప్షన్స్ వస్తాయి.

# ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు ఆడబిడ్డలంతా నడుం బిగించాలి- మంత్రి సీతక్క

మన మీ వార్త జూలై 27: వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ఉద్యమంలా విజయవంతం చేద్దాం హైదరాబాద్-దేశవ్యాప్తంగా నెలకొన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ముఖ్యంగా తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో ముందుండి పాల్గొని ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.
వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని మంత్రి పేర్కొన్నారు. రానున్న



తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం జల సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంగా విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహిళా సంఘాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ నీటి సంరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మించాలనే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలని ఆమె అన్నారు. ఈ నిర్మాణాల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు.
జల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ, వర్షపు నీటి సంరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.
"జల సంరక్షణే మన భవిష్యత్తుకు భరోసా. తెలంగాణ జలసిరిని ప్రజలందరం కలిసి విజయవంతం చేద్దాం. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి సస్యశ్యామల తెలంగాణ నిర్మాణానికి మనమంతా భాగస్వాములు కావాలి" అని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు..

# ఎల్-నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.

మన మీ వార్త జూలై 27: వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే తక్కువ వర్షపాతం, నీటి కొరత పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కన్వర్జెన్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి పరిమాణం, సాగునీటి అవసరాలు, పంటల ప్రస్తుత పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.
వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, సాగునీటి, విద్యుత్, భూగర్భ జలాల శాఖలు పరస్పర సమన్వయంతో జిల్లా కాంటింజెన్సీ ప్లాన్‌ను





రూపొందించాలని తెలిపారు.
తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను రైతులకు సూచించడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, అవసరమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.
ఈ సమీక్ష లో వివిధ మండలాల వ్యవసాయ,మరియు ఉద్యాన వన శాఖ క్షేత్ర స్థాయి అధికారులతో మండల వారిగా జిల్లా కలెక్టర్ రివ్యూ



చేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డీఆర్వో జెడ్పి సీఈవో రాంరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఎలక్ట్రిసిటీ ఎస్ ఈ ఆనందం, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి శ్రీవల్లి, సంబధిత మండలాల క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జనగామ వరి వద్దు.. ఆరుతడి పంటలే వేయండి

- ఇంటిగ్రేటెడ్ వ్యవసాయంతో రైతులు అధిక ఆదాయం పొందాలి
- తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలి
- రైతులకు అందుబాటులో సమృద్ధిగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం
- జిల్లా రైతులు రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

మన మీ వార్త జూలై 27: వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ప్రస్తుత ఎల్‌నినో (వర్షాభావ) పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగును రైతులు విస్తృతంగా చేపట్టాలని, ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన విత్తన మేళాలను రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. సోమవారం, జనగామ మండలంలోని ఓబుల్‌కేశవాపూర్ గ్రామంలో గల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించి, రైతులతో మాట్లాడారు.
ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను రైతులు విస్తృతంగా సాగు చేయాలని సూచించారు.
ప్రతి ప్రాంతంలోని నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి, ఆదాయం కూడా మెరుగుపడుతుందని తెలిపారు.
"నాణ్యమైన విత్తనం -- అధిక దిగుబడికి పునాది"అనే లక్ష్యంతో రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై





సరసమైన ధరలకు ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు.
రైతులు తమ సమీప రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలకు అధిక సంఖ్యలో హాజరై, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాల మేరకు తమ ప్రాంతానికి అనువైన పంటలను ఎంపిక చేసుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.
ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలు, పశు సంవర్ధక రంగం, కూరగాయల సాగు వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలను కలిపి చేపడితే రైతులకు సంవత్సరం పొడవునా ఆదాయం లభిస్తుందని వివరించారు.
ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని పెంచుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని కూడా తగ్గించుకోవచ్చన్నారు.
కూరగాయల సాగు ద్వారా అనేక మంది రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉద్యానవన పంటలను సాగు చేస్తే ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు.
పశుసంపద అభివృద్ధికి అవసరమైన మేత పంటల సాగుపై ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.
ప్రతి గ్రామంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు





(కూరగాయలు) ఉద్యానవన పంటలు, ప్రత్యామ్నాయ పంటలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు.
రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వారికి అవసరమైన డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాలు, నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు సకాలంలో అందేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.
జిల్లాలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, రైతులకు అవసరమైన ప్రతి విషయంలో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ భరోసా కల్పించారు.
జిల్లాలోని రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.
అనంతరం కలెక్టర్ విత్తన మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి, అందుబాటులో ఉన్న విత్తనాలను పరిశీలించారు.
రైతులకు అందిస్తున్న సేవలు, విత్తనాల నాణ్యత, సరఫరా ఏర్పాట్లపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్ రావు, ఉప సర్పంచ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో ఏఐ టీచర్

**సిరిసిల్ల :** తెలంగాణ విద్యారంగంలో మరో వినూత్న అడుగు పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గీతానగర్ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రంలోనే తొలి హ్యూమనాయిడ్ రోబో టీచర్ అందుబాటులోకి వచ్చింది. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఈ రోబో టీచర్‌ను పాఠశాలకు బహుమతిగా అందించారు. బెంగళూరుకు చెందిన ఇండస్ సంస్థ రూపొందించిన ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హ్యూమనాయిడ్ విద్యార్థులతో నేరుగా సంభాషించడంతోపాటు.. వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం.. పాఠ్యాంశాలను సులభంగా వివరించడం వంటి ప్రత్యేక సామర్థ్యాలను కలిగి ఉంది. ఈ హ్యూమనాయిడ్ రోబో టీచర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అత్యాధునిక టెక్నాలజీతో కూడిన బోధన అందుబాటులోకి తీసుకువచ్చింది.



## కలుషిత తాగునీటి పై ముత్యంపల్లి గ్రామస్థుల ఆందోళన

కాసిపేట, జూలై 27: (మన మీ వార్త మండల ప్రతినిధి)

కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో కలుషిత తాగునీరు సరఫరా అవుతోందంటూ గ్రామస్థులు సోమవారం సింగరేణి మైన్ ప్రధాన గేటు ఎదుట ఆందోళన చేపట్టారు.





తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు కలుషిత నీటి కారణంగా గ్రామ ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని గ్రామ ప్రతినిధులు పేర్కొన్నారు. గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా జరిగే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.
ఆందోళనలో మాజీ సర్పంచ్ ఆడే బాదు, బోయిని తిరుపతి యాదవ్, టీఆర్ఎస్ మండల నాయకులు జగన్‌రాజ్, హరీష్, బోయిని సాయికిరణ్, ప్రసాద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.ఖ

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శేషాద్రి బాధ్యతల స్వీకరణ

మన మీ వార్త జూలై 27:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



హనుమకొండ జిల్లా జడ్పీ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న శేషాద్రి సోమవారం హనుమకొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పూర్తి ఆదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కలెక్టర్ శేషాద్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శేషాద్రికి పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

## రాజీవ్ నగర్ లో వర్షపు నీరు చేరిన ప్రాంతాలను పర్యటించిన - డిసి శైలజ

బోడుప్పల్,జులై 27 (మన మీ వార్త)



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 13వ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీలో ఆదివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగడంతో ఇండ్లలోకి నీరు చేరి కాలనీవాసులు రాత్రంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ, సోమవారం కాలనీలో పర్యటించారు. ఆమె వెంట మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రాకేష్ మరియు సిబ్బంది ఉన్నారు. వర్షపు నీరు చేరిన ప్రాంతాలను, ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్ జెసిబి ట్రాక్టర్ తో కాలువ తీయించారు. అదేవిధంగా నూతన డ్రైనేజీ లైన్ పనులను త్వరగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ తో ఫోన్లో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. చుట్టుపక్కల చెత్త పోగు పడకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ మరియు పలువురు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## సమతామూర్తిని కుటుంబసమేతంగా దర్శించుకున్న త్రిపుర బీజేపీ ఎంపీ బిప్లబ్ కుమార్ దేవ్

**రంగారెడ్డి** త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, భారతీయ జనతా పార్టీ ఎంపీ బిప్లబ్ కుమార్ దేవ్ తన కుటుంబసమేతంగా విచ్చేసి శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్లో సమతామూర్తి (స్టాట్యూడ్ ఆఫ్ ఈక్వాలిటీ) ని దర్శించుకున్నారు. భగవద్రామానుజాచార్యుల పవిత్ర దివ్యమూర్తిని కుటుంబంతో సహా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, సమాజంలో సమత, సిద్ధాంతాలను పెంపొందించేందుకు రామానుజుల వారి బోధనలు ఎంతో దివ్యమైనవని కొనియాడారు. అనంతరం శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారిని బిప్లబ్ దేవ్ దంపతులు, కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామివారు మంగళాశాసనాలు చేసారు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా జీయర్ స్వామివారి ద్వారా బిప్లబ్ కుమార్ దేవ్ అడిగి తెలుసుకున్నారు. సమతామూర్తి ప్రాంగణంలోని 108 దివ్యదేశాల ఆలయాలు, ప్రాంగణ విశేషాలను కుటుంబంతో కలిసి తిలకించి తన సంతోషాన్ని వ్యక్తం చేసిన ఆయన, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ వ్యాప్తికి చిన్న జీయర్ స్వామివారు చేస్తున్న సేవలకు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మై హోమ్ గ్రూప్ ఛైర్మన్ జూపల్లి జగపతిరావు , ఆశ్రమ ప్రతినిధులు మరియు ఇతర ముఖ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## ధరణి పోర్టల్... సర్కార్ సంచలన నిర్ణయం..

**హైదరాబాద్ :** ధరణి పోర్టల్ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోర్టల్ అమలు, టెండర్ ప్రక్రియ, డేటా భద్రత తదితర అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించేందుకు డీజీ చారు సిన్హా నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన స్పెషల్ ఎంక్వైరీ టీమ్ ను ఏర్పాటు చేసింది. ధరణి పోర్టల్ రూపకల్పన నుంచి అమలు వరకు జరిగిన అన్ని ప్రక్రియలను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించనుంది. ధరణి పోర్టల్ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోర్టల్ అమలు, టెండర్ ప్రక్రియ, డేటా భద్రత తదితర అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించేందుకు డీజీ చారు సిన్హా నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన స్పెషల్ ఎంక్వైరీ టీమ్ ను ఏర్పాటు చేసింది. ధరణి పోర్టల్ రూపకల్పన నుంచి అమలు వరకు జరిగిన అన్ని ప్రక్రియలను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించనుంది.

## బిజినెస్

### అధిక కెఫీన్ కలిగిన ఆ పానీయాలకు ఎనర్జీ డ్రింక్ అనే పదం వాడొద్దు : ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆదేశం

అధిక కెఫిన్ కలిగిన పానీయాలను ఎనర్జీ డ్రింక్స్ (జులవడీస్తం ఐఠీబఐని) గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఫీుూూూ×) కీలక ఆదేశాలు జారీచేసింది. పెప్సీ (ౡవుజలంఆ), రెడ్ బుల్ (ౡవసంఎఆశ్రీశ్రీ), మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి 'ఎనర్జీ డ్రింక్' అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90 రోజుల్లోగా తొలగించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది. భారత్‌లో 'ఎనర్జీ డ్రింక్స్' పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని ఫీుూూూ× పేర్కొన్నది. 'శరీరానికి, మనసుకు ఉత్తేజాన్ని ఇస్తుంది' లేదా 'శారీరక బలహీనతను తగ్గిస్తుంది' వంటి ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడింది. బ్రాండింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలతో గతంలోనే రెడ్ బుల్, పెప్సీకోకు చెందిన స్టింగ్, రిలయన్స్ క్యాంపా ఎనర్జీ వంటి బ్రాండ్‌లకు సంస్థ నోటీసులు జారీచేసింది. ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది. దేశీయంగా ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా 2017లో పెప్సీ కంపెనీ తక్కువ ధరకే 'స్టింగ్' బ్రాండ్‌ను పరిచయం చేయడంతో యువతలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటికి ఆదరణ గణనీయంగా పెరిగింది. యూరోమానిటర్ అంచనాల ప్రకారం.. 2028 నాటికి భారత ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ విలువ 1.6 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది.

### దేశంలో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ.. ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్




దేశంలో త్వరలో ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రూ.10, రూ.20 విలువ కలిగిన ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా పరీక్షిద్దామని భారత రిజర్వ్ బ్యాంక్ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభ (ఋతీఖ ఝఎవ్రఋ) లో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ఈ ప్రయోగాల్లో భాగంగా రూ.10, రూ.20 డినామినేషన్లలో వంద కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను ఆర్బీఐ జారీ చేయనుంది. భారతీయ వాతావరణ పరిస్థితుల్లో ఈ నోట్ల మన్నిక, పనితీరును పరిశీలించడమే ఈ క్షేత్రస్థాయి పరీక్షల ప్రధాన ఉద్దేశం. ఈ ప్రయోగాలు విజయవంతమైతేనే వీటిని దేశవ్యాప్తంగా విస్తృతస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే, ప్లాస్టిక్ పాలిమర్ నోట్లను ప్రవేశపెడుతున్నంత మాత్రాన ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దుచేసే ప్రతిపాదన ఏదీ లేదని ప్రభుత్వం స్పష్టంచేసింది. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉంటాయని, ఇవి సులభంగా పాడవవని ఆర్బీఐ పేర్కొన్నది. ముఖ్యంగా తక్కువ విలువ కలిగిన నోట్లు త్వరగా చిరిగిపోతుండటంతో వాటిని తరచూ మార్చాల్సి వస్తోంది. పాలిమర్ నోట్ల వినియోగంవల్ల ముద్రణ, నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.


## గుడ్ న్యూస్ చెప్పిన ఇండియన్ ఆయిల్.. బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్ డెలివరీ



ఎల్పీజీ వినియోగదారులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కొత్త సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ' పేరుతో తేలికైన 10 కిలోల కాంపోజిట్ గ్యాస్ సిలిండర్‌ను ప్రవేశపెట్టడంతోపాటు బుక్ చేసిన నాలుగు గంటల్లోనే ఇంటికే డెలివరీ చేసే సేవను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సేవను ఎంపిక చేసిన నాలుగు నగరాల్లో ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది. సంప్రదాయ ఉక్కు సిలిండర్లతో పోలిస్తే కొత్త 10 కిలోల కాంపోజిట్ సిలిండర్ బరువు తక్కువగా ఉంటుంది. దాంతో దాన్ని మోయడం, తరలించడం, వినియోగించడం మరింత సులభమవుతుందని ఇండియన్ ఆయిల్ తెలిపింది. గృహ వినియోగంతోపాటు చిన్న వ్యాపార అవసరాలకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నది. బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్‌ను ఇంటికే అందించేలా కొత్త సేవను రూపొందించింది. ఈ సేవలో వినియోగదారులకు మరికొన్ని సౌకర్యాలు కూడా కల్పించారు. తమకు అనుకూలమైన డెలివరీ సమయాన్ని ఎంచుకునే అవకాశం కల్పించారు. డిజిటల్ విధానంలో సులభంగా బుక్ చేసుకునే సదుపాయం కూడా అందుబాటులో ఉంటుంది. దాంతో గ్యాస్ బుకింగ్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా మారుతుందని సంస్థ తెలిపింది. ప్రస్తుతం పుణే, గురుగ్రామ్, ఇండోర్, కోయంబత్తూరు నగరాల్లో ఈ కొత్త సేవ అందుబాటులో ఉంది. వినియోగదారుల స్పందనను బట్టి త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించనున్నట్లు ఇండియన్ ఆయిల్ వెల్లడించింది. అలాగే 5 కిలోల ఇండేన్ చోటూ సిలిండర్‌కు కూడా నాలుగు గంటల్లో డెలివరీ సేవను విస్తరించింది. చిన్న కుటుంబాలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు ఎక్కువగా వినియోగించే ఈ సిలిండర్‌ను కూడా త్వరగా అందించేలా చర్యలు తీసుకుంది.

## ఐదు రోజుల నష్టాలకు బ్రేక్.. భారీ లాభాలతో ముగిసిన దేశీయ మార్కెట్లు

**776 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్**
**24 వేల మార్కుకు చేరువైన నిఫ్టీ**
**ముడిచమురు ధరల తగ్గుదలతో ఊపు**
**ఐటీ, మీడియా, రియాల్టీ షేర్ల జోరు**
**రూపాయి బలపడటంతో మెరుగైన సెంటిమెంట్**



వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్ల పాటు నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా పుంజుకున్నాయి. ముడిచమురు ధరలు తగ్గడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు సద్దుమణగడంతో ఇన్వెస్టర్లలో కొనుగోళ్ల ఉత్సాహం పెరిగింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ రెండు శాతానికి పైగా లాభపడ్డాయి. నిఫ్టీ మళ్లీ 24 వేల మార్కుకు చేరువైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 776.29 పాయింట్లు ఎగిసి 76,835.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 229.40 పాయింట్లు పెరిగి 23,995.95 వద్ద స్థిరపడింది. అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు తాత్కాలికంగా నిలిచిపోవడంతో ముడిచమురు ధరలు తగ్గాయి. దీంతో దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఉపశమనం లభిస్తుందనే అంచనాలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. నిఫ్టీ షేర్లలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. కొనుగోళ్లు, కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడుల ప్రవాహం మెరుగుపడటం కూడా దేశీయ మార్కెట్ల సెంటిమెంట్‌ను బలోపేతం చేసిందని అభిప్రాయపడ్డారు. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.11 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం పెరిగాయి. ఐటీ, మీడియా, రియాల్టీ రంగాల షేర్లు కొనుగోళ్లతో కళకళలాడాయి. రియాల్టీ, ఫార్మా, మెటల్ సూచీలు కూడా మూడు రోజుల నష్టాల నుంచి బయటకొచ్చాయి. మరోవైపు ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మాత్రం ఇతర రంగాలతో పోలిస్తే బలహీనంగా కనిపించింది. ముడిచమురు ధరలు తగ్గడం, రూపాయి బలపడటం, ఐటీ షేర్లలో

## స్పోర్ట్స్

## అదరగొడుతున్న యువ బాక్సర్లు.. క్వార్టర్ ఫైనల్లో అంకుశ్, సచిన్!



కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు చెలరేగుతున్నారు. సూపర్ పంచ్‌లతో ప్రత్యర్థులను ఓడిస్తున్న అంకుశ్(ూఅఌఎబంస్త), సచిన్ సివాచ్(ఖ్రాఎఫ్రులు ఐఐఖుఓఎఆ) పతక వేటలో దూసుకెళ్తున్నారు. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ క్వార్టర్ ఫైనల్ చేరగా.. 60 కిలోల ఇంగ్లండ్ బాక్సర్‌ను చిత్తు చేసిన సచిన్ సైతం క్వార్టర్స్ బెర్తు సాధించాడు. దాంతో, వీరిద్దరూ మరో బౌట్ గెలిచారంటే కనీసం కాంస్యం సాతమవుతుంది.అయితే.. వీరు మాత్రం పసిడి పతకమే తమ లక్ష్యమంటున్నారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్, 80 కిలోల విభాగంలో అంకుశ్ క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టారు. సోమవారం జరిగిన 16వ రౌండ్ ఇంగ్లండ్ బాక్సర్ విలియం హెవిట్‌ను సచిన్ చిత్తు చేశాడు. ప్రత్యర్థిపై పంచ్‌లతో విరుచుకుపడిన సచిన్ స్వర్ణం గెలవడమే తన లక్ష్యం అంటున్నాడు. 'కోచ్ మాటలు విన్న తర్వాత నేను పుంజుకున్నాను. నా లక్ష్యం పతకం గెలవడమే. అది కూడా గోల్డ్ మెడల్. టోర్నీ ఆరంభం నుంచి నేను పసిడి కోసమే పోరాడుతున్నా. తొలి రెండు మ్యాచ్‌లు కష్టంగా గట్టెక్కాను. తదుపరి బౌట్‌లకు నేను పక్కాగా సిద్ధమవుతా' అని సచిన్ మీడియాతో వెల్లడించాడు.

**ఏకపక్ష పోరులో**

మరో పదహారో రౌండ్ మ్యాచ్‌లో హర్యానాకు చెందిన అంకుశ్ ధాటికి జులాన్ జాన్(అంటిగ్వా) చేతులెత్తేశాడు. 80 కిలోల విభాగంలో పోటీపడిన అంకుశ్ ఆరంభం నుంచి జులాన్‌పై పంచ్‌ల వర్షం కురిపించాడు. దాంతో, భారత బాక్సర్ 5-0తో గెలుపొందాడు. ఏకపక్ష పోరులో సూపర్ విక్టరీ కొట్టిన ఈ పొడగరి బాక్సర్ అలవోకగా క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. సెమీస్ చేరితే చాలు అంకుశ్ దేశానికి కనీసం కాంస్యం అందించే అవకాశముంది.

### జింబాబ్వే పర్యటనలో కోచ్‌గా లక్ష్మణ్ హిట్.. గంభీర్‌పై వేటు తప్పదా..!




ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్ అనంతరం భారత జట్టు గాడిలో పడేనా? అనే ప్రశ్నలకు జింబాబ్వే పర్యటనతో జవాబు దొరికింది. వరుసగా రెండు సిరీస్‌లో కోల్పోయిన బాధను దిగమింగుతూ శ్రేయస్ అయ్యర్ సేన.. ఆఫ్రికా జట్టును క్లీన్‌స్వీప్ చేసింది. వారం క్రితం చేజారిన నంబర్ 1 ర్యాంకును కైవసం చేసుకుంది టీమిండియా. అలాఅని ఈ క్రెడిట్ అంతా హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ది కాదు. అప్పుడప్పుడు టీ20 జట్టుకు కోచ్‌గా వ్యవహరించే వీవీఎస్ లక్ష్మణ్ హయాంలో అయ్యర్ సేన సిరీస్‌ను 3-0తో గెలిచింది. దాంతో.. ఈ ఫార్మాట్‌లో లక్ష్మణ్‌ను కోచ్‌గా కొనసాగిస్తారా? అనే చర్చ మొదలైంది.
టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో భారత జట్టుకు వైట్‌వాష్ అవమానం ఎదురైంది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ మార్గనిర్దేశం చేసినా కుర్రాళ్లతో నిండిన జట్టు పరిస్థితులను అర్థం చేసుకోలేక.. నిలకడను ప్రదర్శించలేక సిరీస్‌లు కోల్పోయింది. ఫలితంగా.. గౌతీని టీ20 కోచ్‌గా తప్పించాలని, మళ్లీ సూర్యకుమార్ యాదవ్‌కే పగ్గాలు అప్పగించాలని డిమాండ్లు వచ్చాయి. అయితే.. ప్రస్తుతానికి పరిస్థితి మారిపోయింది. వరుసగా రెండు సిరీస్‌లు, నంబర్ 1 ర్యాంక్ కోల్పోయిన టీమిండియా మూడు మ్యాచుల సిరీస్‌లో 3-0తో జింబాబ్వేను చిత్తు చేసింది. కెప్టెన్ అయ్యర్ అయినప్పటికీ కోచ్ మాత్రం వీవీఎస్ లక్ష్మణ్. మూడో టీ20లో జింబాబ్వేపై 35 పరుగుల విజయం అనంతరం కెప్టెన్ అయ్యర్ డ్రెస్సింగ్ రూమ్‌లో లక్ష్మణ్‌పై ప్రశంసలు కురిపించాడు. 'మేము ఏ పొరపాట్లు చేయలేదు. క్యాచ్‌లు వదిలేయడం చాలా వరకు తగ్గింది. సిరీస్ క్లీన్‌స్వీప్ చేయడంలో సహాయక సిబ్బందితో కలిసి జట్టులోని ప్రతిఒక్కరూ ఎంతో కృషి చేశారు. మమ్మల్ని ఎంతగానో ప్రేరేపించినందుకు, మాలో స్ఫూర్తి నింపినందుకు లక్ష్మణ్ సర్‌కు ధన్యవాదాలు. మైదానంలో దిగిన ప్రతిసారి వంద శాతం పోరాడాలని మీరు చెప్పారు. అందుకు మీకు కృతజ్ఞతలు' అని అయ్యర్ పేర్కొన్నాడు. భారత టీ20 కోచ్‌గా లక్ష్మణ్ విజయవంతమవుతున్నాడు. ఇదివరకు శ్రీలంక పర్యటనలోనూ లక్ష్మణ్ జట్టును విజేతగా నిలిపాడు. దాంతో.. అతడికే టీ20 కోచ్‌గా బాధ్యతలు ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అంతేకాదు 2027 వన్డే ప్రపంచకప్‌తో హెడ్‌కోచ్‌గా గంభీర్ కాంట్రాక్ట్ ముగియనుంది. దాంతో.. తదుపరి టీమిండియా కోచ్‌గా లక్ష్మణ్‌ను నియమించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఈ మాజీ సొగసరి ఆటగాడు మాత్రం అందుకు సిద్ధంగా లేనని చెబుతున్నాడు. గౌతం గంభీర్, సీనియర్ కోచింగ్ సిబ్బంది అందుబాటులో లేనప్పుడు నేను కోచ్‌గా ఉంటానంతే అని లక్ష్మణ్ వెల్లడించాడు.

### పట్టువదలని జ్ఞానేశ్వరి.. వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతంతో మురిసిందిలా..!



కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్ వెయిట్‌లిఫ్టర్లు పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పటికే మీరాబాయి చాను, రిషికాంత సింగ్, రాజా ముత్తుపాండీలు మెడల్స్ సాధించగా.. జ్ఞానేశ్వరీ యాదవ్ దేశానికి వెండి పతకం అందించింది. 53 కిలోల విభాగంలో జ్ఞానేశ్వరి ఈ మెడల్ సాధించింది. సోమవారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో నైజీరియా లిఫ్టర్‌కు దాదాపు సరిసమానంగా బరువులెత్తిన ఆమె రెండో స్థానంతో సరిపెట్టుకుంది. గ్లాస్గోలో భారత వెయిట్‌లిఫ్టర్లు అద్భుత ప్రదర్శనతో పతకాలు కొల్లగొడుతున్నారు. ఇప్పటికే ఈ విభాగంలో మూడు మెడల్స్ రాగా.. సోమవారం జ్ఞానేశ్వరి యాదవ్ వెండి వెలుగులు విరజిమ్మింది. 53 కిలోల కేటగిరీలో పోటీపడిన తను.. తొలి ప్రయత్నంలో జ్ఞానేశ్వరి యాదవ్ 82 కిలోలు ఎత్తింది. మూడో ప్రయత్నంలో 85, మూడోసారి 88 కిలోలతో రికార్డు నెలకొల్పింది. అయితే.. కాసేపటికే నైజీరియా లిఫ్టర్ ఒసామె ఒమొలోలా దిదిహ్ ఏకంగా 90 కిలోలు ఎత్తి ఆధిక్యంలో నిలిచింది. స్నాచ్ విభాగంలో రెండో స్థానంలో నిలిచిన భారత లిఫ్టర్.. పసిడికి గట్టిపోటీనిచ్చింది. అనంతరం కీలకమైన జెర్క్ అండ్ స్నాచ్ విభాగంలో ఆమె 103 కిలోలు లిఫ్ట్ చేసింది. ప్రత్యర్థి ఒసామె కూడా 105 కిలోలు ఎత్తడంతో పోటీ రసవత్తరంగా మారింది. ఇక రెండోసారి జ్ఞానేశ్వరి 107 కిలోలు ఎత్తింది. చివరి అటెంప్ట్‌లో ఇద్దరూ 111 కిలోలతో అందర్నీ ఆశ్చర్యపరిచారు. మొత్తంగా 199 కిలోల బరువులెత్తిన జ్ఞానేశ్వరి రెండో స్థానంలో నిలిచి రజతంతో యావత్ దేశం గర్వపడేలా చేసింది.



# నాకు ఎవరేం పని చేసినా నచ్చదంటున్న వెంకీ



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

## పొలిమేర 3 లో యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా..

### మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్‌తో పెరిగిన అంచనాలు!




టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో మంచి విజయాన్ని అందుకుంది. యాక్షన్ సన్నివేశాల్లో అర్జున్ చూపించిన ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను మెప్పించాయి.ఇలాంటి సమయంలో ఆయన 'పొలిమేర 3'లో భాగం కావడం సినిమాకు మరింత బలం చేకూర్చే అంశంగా భావిస్తున్నారు.


## 'మహేంద్రగిరి వారాహి' రిలీజ్ డేట్ ఫిక్స్..

### ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా పవన్ కళ్యాణ్..!




సుమంత్ హీరోగా, దర్శకుడు సంతోష్ జాగర్లపూడి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక సోషియో ఫాంటసీ చిత్రం 'మహేంద్రగిరి వారాహి' విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే కాన్సెప్ట్ పోస్టర్లు, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సెప్టెంబర్ 11న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ, ఈ సినిమా కోసం దాదాపు రెండున్నరేళ్ల పాటు కృషి చేసినట్లు తెలిపారు. మధ్యలో కొన్ని కారణాల వల్ల ప్రాజెక్ట్ ఆలస్యమైనప్పటికీ, చివరకు అనుకున్న స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని చెప్పారు. కథలో ఎన్నో ఊహించని ట్విస్టులు ఉంటాయని, దర్శకుడు సంతోష్ జాగర్లపూడి ప్రేక్షకులకు పూర్తిగా కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందించారని అన్నారు.ఈ సినిమాలో కీలక పాత్ర కోసం నటి ఐశ్వర్యా రాజేశ్‌ను సంప్రదించగా, కథ నచ్చి వెంటనే అంగీకరించారని సుమంత్ వెల్లడించారు. అయితే ఆమె వారాహి అమ్మవారి పాత్రలో కనిపిస్తారా? లేక మరో ప్రత్యేకమైన పాత్రలో ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తారా? అనే విషయాన్ని మాత్రం ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. ఆ సర్‌ప్రైజ్‌ను ప్రేక్షకులు థియేటర్లలోనే ఆస్వాదించాలని కోరారు. సినిమా బడ్జెట్ గురించి మాట్లాడుతూ, మొదట రూ.10 కోట్లలో సినిమా పూర్తి చేయాలని భావించామని, కానీ కథకు తగ్గట్టుగా విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో ఖర్చు గణనీయంగా పెరిగిందన్నారు. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ వర్క్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, ప్రేక్షకులకు గూస్‌బంప్స్ వచ్చేలా విజువల్స్ రూపొందించామని వెల్లడించారు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ, ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయనను సంప్రదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అధికారికంగా ఖరారైన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. చిత్రంలో ఓ ప్రముఖ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాల పాటు ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారని నిర్మాత మధు వెల్లడించారు. అయితే ఆ స్టార్ హీరో ఎవరు అనే విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచడంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి.

## రిషబ్ శెట్టి 'ఛత్రపతి శివాజీ మహారాజ్'లో భూమి పెడ్నేకర్.. యోధురాలి పాత్రలో బాలీవుడ్ బ్యూటీ!



పాన్ ఇండియా స్టార్ రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న ప్రతిష్టాత్మక చారిత్రక చిత్రం ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్ పై మరో ఆసక్తికరమైన అప్డేట్ బయటకు వచ్చింది. భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితకథ ఆధారంగా ఈ భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా హీరోయిన్ ఎంపికకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది.ఈ సినిమాలో బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఆమె చరిత్రలో తన ధైర్యసాహసాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన బేలవాడి మల్లమ్మ పాత్రను పోషించనుంది. శౌర్యం, త్యాగం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ పాత్ర సినిమాలో అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందని సమాచారం. భూమి పెడ్నేకర్ ఇప్పటివరకు ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు తొలిసారి ఇలాంటి చారిత్రక యోధురాలి పాత్రలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కాగా, 'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రిషబ్ శెట్టి, ఇప్పుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ వ్యక్తిత్వం, యుద్ధ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలను తెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించేందుకు మేకర్స్ భారీ స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు సందీప్ సింగ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కథ, విజువల్ డిజైన్, యుద్ధ సన్నివేశాలు, సెట్ల రూపకల్పన వంటి అంశాలపై చిత్రబృందం చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటులు అర్జున్ రాంపాల్, వివేక్ ఒబెరాయ్ కూడా కీలక పాత్రలు పోషించనున్నారు. వీరి పాత్రలకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. అయితే చారిత్రక నేపథ్యానికి తగ్గట్టుగా ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి కథను ప్రముఖ రచయిత రిషి విర్మాని అందిస్తుండగా, సంగీత బాధ్యతలను జాతీయ అవార్డు గ్రహీత అమిత్ త్రివేది నిర్వహిస్తున్నారు. చారిత్రక చిత్రానికి తగ్గట్టుగా శక్తివంతమైన నేపథ్య సంగీతం, భావోద్వేగభరితమైన పాటలను రూపొందించనున్నట్లు సమాచారం. ఈ ఏడాది చివర్లో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం 2028లో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512